# అధ్యాయం-2

## రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ పనితీరు

### హోం (జైళ్ళ) శాఖ

పేజీలు 15 - 43

## 2.1 రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ గురించి సంక్షిప్తంగా...

ఈ శాఖను 1957లో 'అగ్నిమాపక సేవల శాఖ' అనే పేరుతో ఏర్పాటు చేసారు. తర్వాత 2004లో ఈ శాఖ పేరును 'అగ్నిమాపక మరియు అత్యవసర సేవల శాఖ' గానూ, 2009 జూలైలో ' రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ' గానూ మార్చారు. వివిధ రకాల ప్రమాదాలకు మొదట స్పందించే శాఖగా దీన్ని గుర్తించారు. అగ్ని ప్రమాదాలు, వరదలు, తుఫానులు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తుల రక్షణ బాధ్యతను ఈ శాఖకు అప్పగించడమైంది. రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ ప్రధానంగా ఈ కింది విధులను నిర్వర్తిస్తుంది :

- అగ్నిప్రమాదాలు సంభవించినపుడు ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడం, సహాయక చర్యలను చేపట్టడం;
- ప్రజలు భారీగా గుమికూడే సభలు-సమావేశాల్లో, వేడుకల్లో, అత్యంత ప్రముఖుల పర్యటనల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టడం;
- మంటలను ఆర్పే చర్యలకు సంబంధించిన శిక్షణనివ్వడం;
- అగ్నిప్రమాదాల నివారణకు తప్పనిసరిగా తీసుకోవలసిన రక్షణ చర్యలను నిర్దేశించడం;
- అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన రక్షణ చర్యలు, అగ్నిప్రమాదాలు సంభవించినపుడు వ్యవహరించాల్సిన విధానం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం;
- బహుళ అంతస్తుల భవనాల నిబంధనలు - 1981లో నిర్దేశించిన అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన రక్షణ చర్యల నిబంధనలను అమలు చేయడం;
- అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవలసిన రక్షణ చర్యలకు సంబంధించిన నిర్దేశాలున్న ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం -1999నూ, ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక మరియు అత్యవసర సేవల నిర్వహణ, ఫీజుల విధింపు నియమావళి - 2006నూ అమలు చేయడం.

కేంద్ర అంతర్గత భద్రతా(హోమ్) వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలోని 'అగ్నిమాపక సలహాల స్థాయీ సంఘం (స్టాండింగ్ ఫైర్ అడ్వయిజరీ కౌన్సిల్)' జాతీయ స్థాయిలో అత్యున్నత సంస్థ. పరిపాలన, శాసనాల రూపకల్పన, శిక్షణ, పరికరాలు వంటి వాటితోపాటు అగ్నిమాపక సేవలకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సంస్థ సలహాలనిస్తుంది.

### 2.1.1 వ్యవస్థాగత నిర్మాణం

హోమ్ (జైళ్ళ) శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో ఈ శాఖ తన కార్యకలాపాలను నిర్వర్తిస్తుంది. అగ్నిమాపక మరియు అత్యవసర సేవల డైరెక్టర్ జనరల్ (డీజీ ఎఫ్ఎస్) పాలనాపరమైన వ్యవహారాలకు సంబంధించి శాఖాధిపతిగానూ, ముఖ్య నియంత్రణ అధికారిగానూ వ్యవహరిస్తారు. సంచాలకులు (డీఎఫ్ఎస్), అదనపు సంచాలకులు (ఎడీఎఫ్ఎస్), మూడు ప్రాంతాలకు సంబంధించి ముగ్గురు[1] ప్రాంతీయ అగ్నిమాపక అధికార్లు (ఆర్ఎఫ్ఓలు), 23 మంది జిల్లా అగ్నిమాపక అధికార్లు, డీజీ ఎఫ్ఎస్‌కు విధి నిర్వహణలో సహాయపడతారు. రాష్ట్రంలో అగ్నిమాపక, అత్యవసర, సహాయక చర్యలకు సంబంధించిన సేవలందించేందుకు 253 అగ్నిమాపక కేంద్రాలు[2], అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఏర్పాటైన 19 ఫైర్ అవుట్ పోస్టులు ఉన్నాయి. డీఎఫ్ఓ స్థాయి అధికారి పర్యవేక్షణలో పనిచేసే రాష్ట్ర స్థాయి శిక్షణ సంస్థ (ఎస్‌టీఎస్) శాఖాపరమైన కార్యకాలాపాలను నిర్వహించడంలో సిబ్బందికి శిక్షణనిస్తుంది.

---

[1] అనంతపురం(రాయలసీమ), హైదరాబాద్ (తెలంగాణ), విశాఖపట్నం (కోస్తాంధ్ర)

[2] గచ్చిబౌలి వద్ద ప్రభుత్వ - ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో నిర్వహిస్తోన్న ఒక ఫైర్ స్టేషన్‌తో కలిపి

## 2.2 ఆడిట్ విధివిధానాలు

### 2.2.1 ఆడిట్ లక్ష్యాలు

అగ్నిమాపక సేవల శాఖపై 2002-03లో సమగ్రంగా నిర్వహించిన ఆడిట్‌లో కనుగొన్న విషయాలను 2003 మార్చి 31తో ముగిసిన సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై వెలువరించిన కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చడం జరిగింది. ఈ శాఖ పనితీరులో ముఖ్యమైన లోపాలను ఈ నివేదికలో ప్రముఖంగా చర్చించడమైంది. ఈ శాఖకు సంబంధించిన విధానాలను సరైన మార్గంలోకి తీసుకురావడానికి చేపట్టాల్సిన వివిధ చర్యలను కూడా ఈ నివేదికలో సిఫార్సు చేయడం జరిగింది. గత పదేళ్ళ కాలంలో ఈ శాఖ పనితీరు ఏ మేరకు మెరుగుపడిందోనని పరిశీలించేందుకు ప్రస్తుత ఆడిట్‌ను నిర్వహించడమైంది. ప్రస్తుత ఆడిట్‌లో ఈ కింది అంశాలను మదింపు చేయడం జరిగింది:

- అత్యవసర పరిస్థితులనెదుర్కోడానికి రాష్ట్ర విపత్తుల స్పందన మరియు అగ్నిమాపక సేవల శాఖ సన్నద్ధతను బలోపేతం చేసుకొనేందుకు ప్రణాళికా రచన పటిష్టంగానూ, ప్రభావవంతంగానూ ఉందా;
- ఈ శాఖ అవసరాలకు సరిపడినన్ని నిధులను సమకూర్చారా;
- తనకు అప్పగించిన బాధ్యతలను ప్రభావవంతంగా నిర్వహించేందుకు సరైన, తగిన మౌలిక వసతులు ఈ శాఖ వద్ద ఉన్నాయా;
- అగ్నిప్రమాదాల నిరోధానికి, నియంత్రణకు సంబంధించిన ప్రమాణాలు ప్రభావవంతంగా అమలు చేసారా;
- సిబ్బంది నిర్వహణ, సామర్థ్యాలను పెంపొందించుకునే ప్రక్రియలు కట్టుదిట్టంగా ఉన్నాయా, కార్యక్రమాల అమలు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకున్నారా;
- అంతర్గత నియంత్రణలు, పర్యవేక్షణ చాలినంతగా ఉన్నాయా, అవి ప్రభావవంతంగా పనిచేస్తున్నాయా.

### 2.2.2 ఆడిట్ ప్రామాణికంగా తీసుకున్న అంశాలు

ఈ కింది వాటిని ప్రామాణికంగా తీసుకుని, ఆడిట్‌లో కనుగొన్న అంశాలను బేరీజు వేసుకోవడం జరిగింది:

- ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం - 1999 (2006లోని 21వ చట్టం ద్వారా సవరించిన ప్రకారం) (చట్టం);
- ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవల నిర్వహణ, ఫీజుల విధింపు నియమావళి - 2006 (నియమావళి);
- ఏపీ ఫైర్ సర్వీస్ మాన్యువల్ - 1968;
- ఎస్ఎఫ్ఏసీ నిర్దేశించిన ప్రమాణాలు;
- ఏపీ ట్రెజరీ కోడ్, ఏపీ ఫైనాన్షియల్ కోడ్, ఏపీ బడ్జెట్ మాన్యువల్;
- ప్రభుత్వ ఉత్తర్వులు, మంజూరీలు, డీజీఎఫ్ఎస్ జారీచేసిన ఆదేశాలు/సర్క్యులర్లు.

### 2.2.3 ఆడిట్ పరిధి, పద్ధతి

2011 ఆగస్టు నుండి 2012 ఫిబ్రవరి వరకూ నిర్వహించిన ఆడిట్‌లో 2007-12 మధ్య కాలంలో అగ్నిమాపక సేవలకు సంబంధించి, ఈ శాఖ కార్యకలాపాలను పరిశీలించడం జరిగింది. డీజీఎఫ్ఎస్ కార్యాలయం, ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లా అగ్నిమాపక కార్యాలయాల వద్ద రికార్డుల పరిశీలన, సమాచార విశ్లేషణలు ఆడిట్ నిర్వహణా పద్ధతుల్లో ఉన్నాయి. 2011 జూలైలో జరిగిన సమీక్షారంభ సమావేశంలో ఆడిట్ లక్ష్యాలు, పరిధి, ప్రామాణికాంశాలు, పద్ధతుల గురించి డీజీఎఫ్ఎస్‌తో చర్చించడం జరిగింది. ఆడిట్ పరిశీలన కోసం సందర్శించిన వివిధ క్షేత్రస్థాయి యూనిట్ల వద్ద సంబంధిత సిబ్బందితో ఆడిట్‌లో కనుగొన్న విషయాలను చర్చించడమైంది.

అగ్నిమాపక సేవల శాఖ సిబ్బందితో కలసి ఫైర్ స్టేషన్లు, కొన్ని ప్రమాదకర ప్రాంగణాల వద్ద ఉమ్మడి ప్రత్యక్ష తనిఖీ నిర్వహించి అవసరమైన చోట ఆడిట్ కనుగొన్న అంశాలకు మద్దతుగా ఫొటోలను తీసుకోవడం జరిగింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితోనూ, సంబంధిత అధికార్లతోనూ 2012 అక్టోబర్‌లో జరిగిన సమీక్షానంతర సమావేశంలో ఆడిట్ కనుగొన్న విషయాలను చర్చించడమైంది. ప్రభుత్వ సమాధానాలను ఈ నివేదికలో తగిన విధంగా పొందుపర్చడం జరిగింది.

### 2.2.4 ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న నమూనా

డీజీఎఫ్ఎస్ పరిధిలో 2012 మార్చి నాటికి 26 మంది డ్రాయింగ్, డిస్బర్సింగ్ అధికారులు[3] (డీడీఓలు) ఉన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి కార్యాలయంలోని ఏడీఎఫ్ఓ[4] ఆ జిల్లాలోని ఈ శాఖ కార్యాలయాలన్నింటికీ డీడీఓగా వ్యవహరిస్తారు. డీజీ ఎఫ్ఎస్, రాజధాని జిల్లా హైదరాబాద్‌తో పాటు కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాలనుండి రెండేసి జిల్లాల చొప్పున మొత్తం ఏడు జిల్లాల[5] డీఎఫ్ఓలను, వీటి పరిధిలోని 85 ఫైర్ స్టేషన్లను, హైదరాబాద్‌లోని రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థను ఆడిట్‌కు ఎంపిక చేసుకుని సంబంధిత రికార్డులను తనిఖీ చేయడమైంది.

***ఆడిట్‌లో కనుగొన్న అంశాలు***

## 2.3 ప్రణాళికా రచన

### 2.3.1 ముందస్తు/వార్షిక ప్రణాళికలు

ఒక సంస్థ తను సాధించాల్సిన లక్ష్యాలకు, లక్షిత కార్యక్రమాల అమలుకు, వనరుల వినియోగానికి తగిన కార్యాచరణ ప్రణాళికలు, వ్యూహాలను వెల్లడించడానికి, లక్ష్యాలకు అనుగుణంగా సాధించిన పురోగతిని పర్యవేక్షించడానికి, పనితీరు సూచికలను నిర్ణయించడానికి మధ్యకాలికం నుండి దీర్ఘకాలిక ప్రణాళికలు ఉండాలి.

ఈ శాఖకు సంబంధించిన ప్రణాళికలు/ప్రాథమ్యాలను రాష్ట్ర ప్రభుత్వ వార్షిక ప్రణాళికల్లో చేర్చలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. కావలసిన మౌలిక వసతులు, సంస్థాగత అవసరాలు, వ్యూహాత్మక/ముందస్తు ప్రణాళికల ద్వారా వాటిని సమకూర్చుకోవడానికి గడువులను డీజీ ఎఫ్ఎస్ నిర్ధారించలేదు. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లో స్థానిక అవసరాలు, వాటిని సమకూర్చుకునేందుకు ప్రతిపాదించిన విధానాలను తెలిపే వార్షిక కార్యాచరణ ప్రణాళికలు ఏ ఒక్క జిల్లాలోనూ లేవు. ముందస్తు/కార్యాచరణ ప్రణాళికలు లేనందున ప్రాథమ్యాలను గుర్తించ లేకపోయారు; డిపార్టుమెంటు లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్దంగా, నిర్దేశిత చర్యలేవీ చేపట్టలేదు.

### 2.3.2 నిర్వహణ సమాచారం

ఈ శాఖ తన కార్యకాలాపాలను ప్రభావవంతంగా నిర్వహించడానికి ప్రాంతాలవారీగా జనాభా వివరాలు, సేవలు అందించాల్సిన గ్రామాలు, ఇళ్ళు, ప్రమాదకర/ప్రమాద రహిత ప్రాంగణాల వంటి విభాగాల వారీ వివరాలు, ఫైర్ స్టేషన్లు, అవి వున్న ప్రదేశం, ప్రతి ఫైర్ స్టేషన్ పరిధిలోనూ వివిధ ప్రదేశాల మధ్య దూరాలను సూచించే భౌగోళిక మ్యాపింగ్, దగ్గరి దార్లు, ట్రాఫిక్ రద్దీ ఉండని మార్గాలు, అందుబాటులో ఉన్న నీటి వనరులు మొదలైన వివరాలతో కూడిన సమగ్రడేటాబేస్ ఉండటం అత్యంత ఆవశ్యకం.

---

[3] డీజీఎఫ్ఎస్-1, ఆర్ ఎఫ్ ఓ - సెంట్రల్ -1, ఎస్‌టీఐఎస్ -1, డీఎఫ్ఓలు - 23

[4] సహాయక జిల్లా అగ్నిమాపక అధికారి

[5] చిత్తూరు, హైదరాబాద్, కృష్ణా, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, విశాఖపట్నం, వైయస్ఆర్(కడప) - వీటిలో నాలుగు (చిత్తూరు, హైదరాబాద్, కృష్ణా, విశాఖపట్నం) జిల్లాలకు సంబంధించి గత ఆడిట్ సమీక్షలో కనుగొన్న అంశాలను 2002-03 సంవత్సరపు ఆడిట్ నివేదికలో ప్రస్తావించడమైంది

మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లోని ఏ ఒక్క డీఎఫ్ఓ వద్దా ఇలాంటి డేటాబేస్‌ను నిర్వహించడంలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది. అంతేగాక, అత్యంత ఎత్తైన భవనాల్లో అగ్ని ప్రమాదాలనెదుర్కోడానికి, భూకంపాలు ఇతర ప్రకృతి విపత్తుల్లో వ్యవహరించేందుకు ఎలాంటి ప్రామాణిక నిర్వహణ పద్ధతులనూ ఈ శాఖ అభివృద్ధి చేయలేదు.

### 2.3.3 ఉపసంఘం సిఫార్సులు

ఈ శాఖను పటిష్ఠపర్చాల్సిన ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం దీని పునర్నిర్మాణం కోసం 2008 మేలో హోమ్ మంత్రి అధ్యక్షతన ఒక ఉపసంఘాన్ని నియమించింది. అత్యవసర పరిస్థితులు, విపత్తుల సమయంలో అన్వేషణ, రక్షణ అవసరాలకు సత్వరమే స్పందిచేలా వాహనాలు, పరికరాలను సమకూర్చడం, సిబ్బందికంతటికీ శిక్షణ నివ్వడం ద్వారా అగ్నిమాపక సేవల శాఖను అన్ని స్థాయిల్లోనూ పటిష్ఠపరచాల్సిన అవసరముందని ఈ ఉపసంఘం అభిప్రాయపడింది. ప్రస్తుతం ఫైర్ స్టేషన్లు అవసరాలకు తగినట్లుగా లేవని, వాటికి సరిపడినన్ని నిధులను బడ్జెట్‌లో పొందుపరచడడం లేదని కూడా ఈ ఉపసంఘం అభిప్రాయపడింది. ఈ ఉపసంఘం పలు ఇతర అంశాలతో పాటుగా ఈ కింది సిఫార్సులను చేసింది (2009 ఫిబ్రవరి) ః

⇒ ఈ శాఖ పేరు మార్చడం;

⇒ కొత్తగా 140 ఫైర్ స్టేషన్లను ఏర్పాటు చేయడం; ముఖ్యంగా, కనీసం ఒక్క ఫైర్ స్టేషన్ కూడా లేని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వీటిని ఏర్పాటు చేయడం;

⇒ అన్వేషణ - రక్షణ చర్యలను చేపట్టడానికి జిల్లా స్థాయిలో 23 బృందాలను సబ్ డివిజనల్ ముఖ్య కేంద్రాల్లో 93 బృందాలను ఏర్పాటు చేయడం;

⇒ హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడలలో అణు, జీవ, రసాయన విపత్తులకు సంబంధించిన అన్వేషణ - రక్షణ బృందాలను ఏర్పాటు చేయడం;

⇒ రాష్ట్ర స్థాయి ఆధునిక సమాచార వ్యవస్థ, మొదలైన వాటిని ఏర్పాటు చేయడం;

⇒ విపత్తుల ఉపశమన నిధి నుండి 20 శాతం నిధులను ప్రత్యేక పరికరాల కొనుగోలుకు కేటాయించడం;

⇒ ఆధునికీకరణ పథకం అమలుకు మున్సిపల్ సంస్థలు వసూలు చేసే ఆస్తి పన్ను నుండి 3 శాతాన్ని కేటాయించడం.

ఉపసంఘం సిఫార్సులను ప్రభుత్వం 2009 జూలైలో అంగీకరించినప్పటికీ, వీటి అమలుకు నిర్ణీత కాలవ్యవధిని నిర్దేశించలేదు. ఈ శాఖ పేరు మార్పు (2009 జూలై), హైదరాబాద్ - సికింద్రాబాద్ జంటనగరాల్లో అన్వేషణ - రక్షణ బృందాల ఏర్పాటు తప్ప (ఇలాంటి బృందాలను మొత్తం 23 ఏర్పాటు చేయాల్సి ఉండగా) , మూడేళ్ళకు పైగా గడచినప్పటికీ 2012 నవంబరు నాటికి ఉపసంఘం సిఫార్సులేవీ అమలు కాలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

డీజీ ఎఫ్ఎస్ దీన్ని అంగీకరిస్తూ, ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడమే ఇందుకు కారణమని తెలిపారు (2012 నవంబరు).

## 2.4 చాలినంతగా లేని బడ్జెట్

2007-12 మధ్య కాలానికి ఈ శాఖ బడ్జెట్ కేటాయింపులు, ఖర్చుల వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి ః

పట్టిక 2.1

(₹ కోట్లలో)

| సంవత్సరం | డీజీఎఫ్ఎస్ కోరిన నిధులు | బడ్జెట్ కేటాయింపులు (శాతం) | ఖర్చు | వినియోగించని నిధులు(-)/ అధిక ఖర్చు (+) |
|---|---|---|---|---|
| 2007-08 | 186 | 69 (37) | 64 | (-) 5.00 |
| 2008-09 | 159 | 79 (50) | 79 | 0.00 |
| 2009-10 | 243 | 89 (37) | 83 | (-) 6.00 |
| 2010-11 | 358 | 121 (34) | 107 | (-) 14.00 |
| 2011-12 | 334 | 145 (43) | 150 | (+) 5.00 |
| మొత్తం | 1280 | 503 | 483* | |

** ప్రణాళిక: ₹25 కోట్లు; ప్రణాళికేతర: ₹458 కోట్లు*

*మూలం: సంబంధిత సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వినిమయ పద్దులు, డీజీఎఫ్ఎస్ ఇచ్చిన సమాచారం*

2007-12 మధ్య కాలంలో ప్రతి ఏటా డిపార్టుమెంటు కోరిన మొత్తంలో కేవలం 34 నుండి 50 శాతం వరకు మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తున్నట్లు పై పట్టికలోని వివరాలను చూస్తే తెలుస్తోంది. 2002-03 సంవత్సరానికి వెలువరించిన భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపర్చిన అంశాల మేరకు ఫైర్ స్టేషన్లకు శాశ్వత భవనాలు, నీటి ట్యాంకులు, బోరు బావుల నిర్మాణం, మంటలనార్పే యంత్రాలతో కూడిన వాహనాలు పోర్టబుల్ పంపులు, విద్యుత్తు మోటార్ల కొనుగోలు కోసం డీజీ ఎఫ్ఎస్ 2007-08 నుండి 2011-12 మధ్యకాలంలో ప్రతి ఏటా బడ్జెట్ ప్రతిపాదనలను సమర్పిస్తున్నారు. అంతేగాక, 89 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కొత్త ఫైర్ స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించి తమ అవసరాలను ఈ శాఖ 2008-09 నుంచి బడ్జెట్ ప్రతిపాదనల్లో సమర్పిస్తోంది. కానీ, సమీక్షా కాలంలోని ఏ సంవత్సరపు బడ్జెట్లోనూ అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయించ లేదు.

బడ్జెట్ విడుదలను నిలిపివేయడం/బడ్జెట్ విడుదల ఉత్తర్వులను జారీ చేయకపోవడం వలన బడ్జెట్లో కేటాయించిన నిధులు కూడా ఈ శాఖకు లభ్యం కాలేదు. ఇందువలనే 2007-08 నుండి 2010-11 మధ్యకాలంలో బడ్జెట్ కేటాయింపులమేర కూడా నిధులు ఖర్చు కాలేదని డీజీఎఫ్ఎస్ తెలిపారు. ముఖ్యంగా, 2010-11లో ₹13.76 కోట్ల మేర మిగుళ్ళేర్పడినట్లు తెలిపారు. బడ్జెట్లో కేటాయించినమేర పూర్తి నిధులను విడుదల చేయని కారణంగా ఇప్పటికే ఏర్పాటయిన 30 ఫైర్ స్టేషన్లకు శాశ్వత భవనాల నిర్మాణం, మంటలనార్పే యంత్రాల కొనుగోలు, నీటి సదుపాయాల కల్పన, కొత్త ఫైర్ స్టేషన్లను ఏర్పాటు చేయడంలో ఈ శాఖ ముందుకెళ్ళలేక పోయింది. 2007-08 నుండి 2011-12 మధ్యకాలంలోని మొత్తం ఖర్చులో ఈ శాఖ తన విధుల నిర్వహణ కోసం చేసిన ఖర్చు[6] 12 నుండి 27 శాతం వరకు ఉండగా, మిగిలినదంతా సిబ్బంది జీత భత్యాలకు, కార్యాలయ నిర్వహణకు ఖర్చయింది.

ఆడిట్ పరిశీలనలను అంగీకరిస్తూ, కార్యాలయాలు/ఫైర్ స్టేషన్లకు భవనాల నిర్మాణానికి 2012-13 ఆర్థిక సంవత్సరంలో ₹25 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

## 2.4.1 విపత్తుల ఉపశమన నిధి నుండి నిధులను తక్కువగా విడుదల చేయడం

రాష్ట్రంలో అగ్నిమాపక సేవలను పటిష్టపరచేందుకు విపత్తుల ఉపశమన నిధి (సీఆర్ఎఫ్[7])కి కేటాయించిన నిధుల్లో 10 శాతం నిధులను అన్వేషణ - రక్షణ చర్యలకు సమాచార పరికరాలతో సహా ఆధునిక పరికరాలను కొనుగోలు చేయడానికి వినియోగించుకోవచ్చని భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి 2006 సెప్టెంబరులో అనుమతిని

[6] 2007-08: ₹12 కోట్లు (18 *శాతం*), 2008-09 : ₹18 కోట్లు(23 *శాతం*), 2009-10: ₹11 కోట్లు (13 *శాతం*), 2010-11: ₹13 కోట్లు (12 *శాతం*), 2011-12: ₹40 కోట్లు (27 *శాతం*)

[7] ప్రస్తుతం దీన్ని 'రాష్ట్ర విపత్తుల స్పందన నిధి'గా వ్యవహరిస్తున్నారు

ఇచ్చింది. 2007-12 మధ్యకాలానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా విపత్తుల ఉపశమన నిధికి ₹559.76 కోట్లను విడుదల చేసింది. ఇదేకాలానికి భారత ప్రభుత్వం తన వాటాగా (75 శాతం) ₹1,579.25 కోట్లను విడుదల చేసింది. ఆ వివరాలను ఈ కింది పట్టికలో చూపడమైంది.

పట్టిక 2.2

(₹ కోట్లలో)

| సంవత్సరం | విపత్తుల ఉపశమన నిధికి జమయిన మొత్తం (కేంద్ర వాటా: 75 శాతం రాష్ట్ర వాటా: 25 శాతం) | 10 శాతం వాటాగా అగ్నిమాపక సేవలకు ఇవ్వాల్సిన నిధులు | రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక సేవలకు వాస్తవంగా విడుదల చేసిన నిధులు |
|---|---|---|---|
| **2007-08** | 379.35 | 37.94 | 0.50 |
| **2008-09** | 398.31 | 39.83 | 1.33 |
| **2009-10** | 418.23 | 41.82 | 0.00 |
| **2010-11** | 508.84 | 50.88 | 0.00 |
| **2011-12** | 434.28 | 43.43 | 0.00 |
| మొత్తం | **2139.01** | **213.90** | **1.83** |

*మూలం : రెవెన్యూ (విపత్తుల నిర్వహణ - III) శాఖ ఇచ్చిన సమాచారం*

2007-12 మధ్యకాలంలో ఆధునిక పరికరాల కొనుగోలు కోసం విపత్తుల ఉపశమన నిధి నుండి 10 శాతం నిధులు (₹213.90 కోట్లు[8]) విడుదల చేసేందుకు భారత ప్రభుత్వం అనుమతించగా, రాష్ట్ర ప్రభుత్వం ఒక శాతం కంటే తక్కువ నిధులను (₹1.83 కోట్లు) విడుదల చేసింది. విపత్తుల ఉపశమన నిధుల నుండి నిధుల విడుదల కోసం డీజీఎఫ్ఎస్ ఎప్పటికప్పుడు కోరుతున్నప్పటికీ, 2012 నవంబరు నాటికి ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు.

ప్రభుత్వం నిధులు విడుదలచేయని కారణంగా ఆధునికీకరణ ప్రక్రియ చేపట్టలేకపోయారు. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో ప్రతిపాదించిన (2006) అన్వేషణ - రక్షణ బృందాలను ఏర్పాటు చేయలేదు.

## 2.4.2 అగ్నిమాపక సేవల పన్ను వసూలు చేయకపోవడం

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం - 1999, ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక మరియు అత్యవసర సేవల నిర్వహణ, ఫీజుల విధింపు నియమావళి - 2006 లోని నిబంధనల ప్రకారం, స్థలాలు, భవనాలపై విధించే ఆస్తి పన్నులో ఒక శాతం చొప్పున (సర్‌చార్జి రూపంలో) అగ్నిమాపక సేవల పన్నును విధించాలి. భూమి శిస్తు బకాయిలను వసూలు చేసే విధంగానే దీన్ని రికవరీ చేయాలి.

సంబంధిత చట్టం 2001లోనూ, నియమావళి 2006లోనూ అమల్లోకి వచ్చినప్పటికీ, స్థానిక సంస్థల ద్వారా అగ్నిమాపక సేవల పన్ను వసూలుకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయలేదు. ఫలితంగా, 2007 ఏప్రిల్ నుండి 2012 మార్చి వరకు అగ్నిమాపక సేవల పన్ను రూపంలో రాగల ₹49.11 కోట్ల[9] రాబడిని ప్రభుత్వం రాబట్టు కోలేకపోయింది. అగ్నిమాపక, అత్యవసర సేవలకు ఈ రాబడి ఉపయోగపడి ఉండేది.

[8] (భారత ప్రభుత్వం విడుదల చేసిన 75 శాతం : ₹1,579.25 కోట్లు + రాష్ట్ర వాటా (25 శాతం) : ₹559.76 కోట్లు)లో 10 శాతం

[9] 2007-12 మధ్యకాలంలో స్థానిక సంస్థలు వసూలు చేసిన ₹4,911 కోట్ల ఆస్తి పన్నులో 1 శాతం

## 2.5 మౌలిక వసతులు, అగ్నిమాపక సేవల నిర్వహణ

### 2.5.1 మౌలిక వసతులు

#### *2.5.1.1 ఫైర్ స్టేషన్ల ఏర్పాటు*

పట్టణాల్లో ప్రతి 10 చదరపు కిలోమీటరుకు ఒకటి చొప్పున, గ్రామీణ/ఆరుబయలు ప్రాంతాల్లో ప్రతి 50 చదరపు కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఫైర్ స్టేషన్లు ఉండాలని స్టాండింగ్ ఫైర్ అడ్వయిజరీ కౌన్సిల్ (ఎస్ఎఫ్ఏసీ) సిఫార్సు చేసింది. ఈ ప్రమాణాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 5,502 ఫైర్ స్టేషన్లు ఉండాలి.

ఆడిట్ పరిశీలనలో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

**(i)** రాష్ట్రంలో 2.75 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణానికి[10] మొత్తం 253 ఫైర్ స్టేషన్లు మాత్రమే ఉన్నాయి (కొరతః 95 శాతం). 2007-12 మధ్యకాలంలో కొత్తగా ఒక్క ఫైర్ స్టేషన్ కూడా ఏర్పాటు కాలేదు. ఆంధ్రప్రదేశ్ శాసన సభా ప్రాంగణంలో ఒక కొత్త ఫైర్ స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదనతో సహా కొత్తగా ఆరు ఫైర్ స్టేషన్ల ఏర్పాటుకు 2011 మేలో ప్రభుత్వం పరిపాలనా అనుమతినిచ్చింది. కానీ, నిధుల కేటాయింపు/ భూ కేటాయింపు జరగని కారణంగా 2012 నవంబరు వరకూ వీటి ఏర్పాటు జరగలేదు.

**(ii)** నిర్దేశిత ప్రమాణాల ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో ప్రతి 10 చదరపు కిలో మీటర్లకూ ఒకటి చొప్పున, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 చదరపు కిలో మీటర్లకు ఒకటి చొప్పున ఫైర్ స్టేషన్లు ఉండాలి. కానీ పట్టణ ప్రాంతాల్లో 16 నుండి 144 చదరపు కిలో మీటర్లకు ఒకటి చొప్పున, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 144 నుండి 1480 చదరపు కిలో మీటర్లకు ఒకటి చొప్పున ఫైర్ స్టేషన్లు ఉన్నాయి.

**(iii)** ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం, ప్రతి ఫైర్ స్టేషన్ పరిధిలోనూ 50,000 జనాభా ఉండాలి. కానీ ఒక్కో ఫైర్ స్టేషన్ పరిధిలో 3 లక్షల జనాభా ఉంది.

**(iv)** 2012 నవంబరు నాటికి, రాష్ట్రంలోని 875 మండలాల్లో (మొత్తం మండలాలుః1,128[11]), 89 అసెంబ్లీ నియోజకవర్గాల్లో (మొత్తం నియోజకవర్గాలుః 294) ఒక్క ఫైర్ స్టేషనూ లేదు (వివరాలు *అనుబంధం 2.1*లో ఉన్నాయి).

**(v)** రద్దీ ప్రదేశాలు/అధిక జనాభా గల ప్రాంతాల్లో ఫైర్ స్టేషన్ల నిర్వహణకు ఈ శాఖ ప్రాధాన్యతనివ్వలేదు. ఆ వివరాలను ఈ కింద చర్చించడమైంది :

- వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల నిధులతో చేపట్టేలా మార్కెటు యార్డులకు మాత్రమే ప్రత్యేకించిన 10 ఫైర్ స్టేషన్లను[12] ప్రభుత్వం మంజూరు చేసింది (2009 నవంబరు). ఈ పదింటిలో ఏడు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలు ఇందుకోసం (2010 ఫిబ్రవరి - సెప్టెంబరు) ₹2.65 కోట్ల నిధులను డీజీఎఫ్ఎస్ వద్ద డిపాజిట్ చేసాయి. 2012 నవంబరు నాటికి ₹1.01 కోట్ల ఖర్చుతో అగ్నిమాపక యంత్ర వాహనాలకు 'చాసిస్'లను కొనుగోలు చేసారు. వీటి విడిభాగాలను కలిపే పని (ఫ్యాబ్రికేషన్) జరుగుతోంది. మిగతా ₹1.43 కోట్లు ఖర్చుకాకుండా డీజీఎఫ్ఎస్ దగ్గరే ఉన్నది. ఆశించిన లక్ష్యం నెరవేరలేదు.

---

[10] గ్రామీణ : 2.71 లక్షల చదరపు కిలోమీటర్లు, పట్టణ : 4,480 చదరపు కిలో మీటర్లు (2011 జనాభా లెక్కల ప్రకారం)

[11] రాష్ట్రంలోని మొత్తం మండలాల సంఖ్య పంచాయతీరాజ్ - గ్రామీణాభివృద్ధి శాఖ రికార్డుల ప్రకారం 1108 కాగా, అగ్నిమాపక సేవల శాఖ రికార్డుల ప్రకారం 1128

[12] ఆదిలాబాద్, భైంసా, గుంటూరు, జమ్మికుంట, కరీంనగర్, ఖమ్మం, కర్నూలు, నిజామాబాద్, సూర్యాపేట, వరంగల్

- తిరుపతి పుణ్యక్షేత్రంలో 6 లక్షల జనాభా ఉంది. ఈ క్షేత్రంలో సందర్శకుల జనాభా ప్రతి రోజూ సుమారు లక్ష వరకూ ఉంటుంది. బస్ టెర్మినళ్ళు, రైల్వే స్టేషన్ల వంటి బహిరంగ ప్రదేశాల్లో విపరీతంగా ఉండే రద్దీ, పెరుగుతున్న బహుళ అంతస్తుల హోటళ్ళ వలన అగ్ని ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుంటే తిరుపతి పట్టణ, గ్రామీణ, చుట్టు పక్కల ఉన్న మరో నాలుగు మండలాలకు 12 ఫైర్ స్టేషన్లు కావలసి ఉండగా, తిరుపతి[13] వద్ద ఉన్న ఒకే ఒక్క ఫైర్ స్టేషన్ వీటన్నింటికీ సేవలందిస్తోంది. తిరుపతి, తిరుమలలో కొత్తగా ఐదు ఫైర్ స్టేషన్లు ఏర్పాటుచేయడానికి నిధులను సమకూర్చాల్సిందిగా 2012 సెప్టెంబరులో తిరుమల తిరుపతి దేవస్థానాల(టీటీడీ) సంస్థను కోరామని ప్రభుత్వం సమాధానమిచ్చింది (2012 నవంబరు).

ఆడిట్ పరిశీలనలను అంగీకరిస్తూ, కనీసం ఒక్క ఫైర్ స్టేషన్ కూడా లేని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2012-13 నుండి దశలవారీగా ఫైర్ స్టేషన్ల స్థాపనకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామని డీజీ ఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

### 2.5.1.2 ఫైర్ స్టేషన్లలో మౌలిక వసతులు

చిత్తూరు, హైదరాబాద్, క్రిష్ణా, విశాఖపట్నం జిల్లాల్లోని ఫైర్ స్టేషన్లలో సరైన మౌలిక వసతులు లేకపోవడాన్ని గత ఆడిట్ నివేదికలో ప్రస్తావించడం జరిగింది. మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లోని (గతంలో తనిఖీ చేసిన జిల్లాలతో సహా) ఫైర్ స్టేషన్లలో 2007-12 మధ్యకాలంలో మౌలిక వసతుల్లో చెప్పుకోదగినంత అభివృద్ధి లేదు. ఆ వివరాలను ఈ కింద చర్చించడమైంది :

#### భూమి

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి-2006 ప్రకారం, ప్రతి ఫైర్‌స్టేషన్‌కు రెండు ఎకరాల భూమి కావాలి. ఇందులో ఒక భవనంతోపాటు, అగ్నిమాపక వాహనాలు, పరికరాలు సిబ్బందికి తగిన వసతి కల్పించాలి. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లో 85 ఫైర్‌స్టేషన్లు ఉంటే, కేవలం 7 ఫైర్‌స్టేషన్లకు మాత్రమే (8 శాతం) ప్రమాణాల మేరకు రెండెకరాల భూమి ఉంది.

**పట్టిక 2.3**

| జిల్లా | మొత్తం ఫైర్ స్టేషన్లు | ఫైర్ స్టేషన్ల సంఖ్య | | | |
|---|---|---|---|---|---|
| | | రెండు ఎకరాలు ఉన్నవి | ఒకటి నుండి రెండు ఎకరాల మధ్య ఉన్నవి | ఎకరం కంటే తక్కువ ఉన్నవి | భూమి లేనివి |
| చిత్తూరు | 15 | 1 | 2 | 8 | 4 |
| హైదరాబాద్ | 12 | – | – | 6 | 6 |
| కృష్ణా | 21 | 2 | 3 | 15 | 1 |
| మహబూబ్‌నగర్ | 8 | 2 | 2 | 3 | 1 |
| రంగారెడ్డి | 6 | – | 2 | 3 | 1 |
| విశాఖపట్నం | 11 | – | 2 | 8 | 1 |
| వైఎస్ఆర్ (కడప) | 12 | 2 | 3 | 7 | - |
| **మొత్తం** | **85** | **7** | **14** | **50** | **14** |

*మూలం : జిల్లా అగ్నిమాపక అధికారుల రికార్డులు*

తమ విధుల నిర్వహణకు సరిపడేంత భూమిని పొందలేకపోవడమే కాకుండా, అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖ తన భూములను ఇతర సంస్థలు ఆక్రమించుకోకుండా రక్షణ కల్పించుకోలేకపోయింది. ఆ వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

[13] మరొకటి తిరుమలలో ఉంది

- ప్రహరీగోడను నిర్మించని కారణంగా నారాయణపేటలోని ఫైర్‌స్టేషన్ భూమి ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణకు గురయింది. రెవెన్యూ అధికార్లద్వారా భూమిని మరోసారి సర్వే చేయించమని మహబూబ్‌నగర్ డిఎఫ్ఓ నారాయణపేట ఫైర్‌స్టేషన్ అధికారిని 2011 ఆగస్టులో ఆదేశించినప్పటికీ 2012 జూన్ నాటికి సర్వే జరగలేదు.

- మలక్‌పేట ఫైర్‌స్టేషన్ తాలూకు ఖాళీ స్థలాన్ని జైళ్లశాఖ ఆక్రమించింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదు (2012 జూన్).

తమ శాఖ భూముల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామని డీజీఎఫ్ఎస్ హామీ ఇచ్చారు (2012 నవంబరు).

### భవనాలు

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి-2006 ప్రకారం అగ్నిమాపక వాహనాలు, పరికరాలను సురక్షితంగా భద్రపరచడానికి ప్రతి ఫైర్‌స్టేషన్‌కు శాస్వత భవనం ఉండాలి. ఆడిట్ పరిశీలనలో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

రాష్ట్రంలో మొత్తం 253 ఫైర్‌స్టేషన్లు ఉండగా, అందులోని 30 ఫైర్‌స్టేషన్లకు భవనాలు లేవు, మచ్చుకు తనిఖీచేసిన ఏడు జిల్లాల్లోని 85 ఫైర్‌స్టేషన్లకుగానూ 17 ఫైర్‌స్టేషన్ల భవనాలు (20 శాతం) శిధిలావస్థలో ఉన్నాయి. మరో 6 ఫైర్‌స్టేషన్లలో అగ్నిమాపక వాహనాలను నిలిపేందుకు వసతిలేదు. ఆ వైనాన్ని కింది ఫోటోలలో చూడవచ్చు.



*తాండూరు ఫైర్‌స్టేషన్‌లో ఆరుబయట నిలిపి ఉంచిన అగ్నిమాపక వాహనాలు (2011 సప్టెంబరు 17)*



*శిధిలావస్థలో ఉన్న గద్వాల ఫైర్‌స్టేషన్ భవనం (2011నవంబరు 10)*

- చిత్తూరు జిల్లాలో 2004 లో నాలుగు ఫైర్‌స్టేషన్లను[14] ఏర్పాటు చేసారు. కానీ, 2012 నవంబరు నాటికి వీటికి శాశ్వత భవనాల సదుపాయం కల్పించలేదు. ఈ ఫైర్‌స్టేషన్లలోని వాహనాలు, పరికరాలను ఉంచేందుకు సరైన వసతిలేక ఇవి వాతావరణ మార్పుల దుష్ప్రభావానికి గురవుతున్నాయి.

ఫైర్ స్టేషన్ల నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం 2012-13 ఆర్థిక సంవత్సరంలో కేటాయించినందున ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

### నీటి వనరులు

ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం, ఫైర్‌స్టేషన్ విధుల నిర్వహణకు నిరంతరం నీటి సరఫరా ఉండటం అత్యంత ఆవశ్యకం. ప్రతి ఫైర్‌స్టేషన్‌లోనూ ప్రభావవంతమైన విధి నిర్వహణకు 25,000 లీటర్ల సామర్ధ్యంగల నీటి ట్యాంకులు, బోరుబావి, విద్యుత్తు మోటార్లు ఉండటం అత్యవసరం.

[14] నగరి, వాయల్పాడు(వాల్మీకిపురం), పాకాల, ములకల చెరువు

మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని 85 ఫైర్‌స్టేషన్లకుగానూ, 9[15] ఫైర్‌స్టేషన్లకు (11 శాతం) మాత్రమే వాటి ప్రాంగణంలో నీటి సదుపాయం ఉంది; 51 ఫైర్‌స్టేషన్లు (60 శాతం) తమ నీటి అవసరాలకు 2 కి.మీ.పైగా దూరంలో ఉన్న సాగునీటి కాల్వలు, ఇతర వనరులనుండి నీటిని తీసుకుంటున్నాయి.

ఆడిట్ పరిశీలనలను అంగీకరిస్తూ, మొత్తం 253 ఫైర్‌స్టేషన్లకు నీటి ట్యాంకుల నిర్మాణం, బోరుబావుల తవ్వకం, విద్యుత్తుమోటార్లు మొదలైన వాటికి 2012-13 సంవత్సరానికి ప్రభుత్వం తగిన నిధులను కేటాయించిందని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

### పరికరాలు

అగ్ని ప్రమాదాలను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి సంబంధిత సామాగ్రి సరిపడినంతగానూ, సిద్ధంగానూ ఉండటమనేది కీలకమైన అంశాల్లో ఒకటి. ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం ప్రతి 50,000 జనాభాకు ఒక అగ్ని మాపక వాహనం, 3 లక్షల జనాభాకు ఒక రక్షణ వాహనం (రెస్క్యూ వ్యాన్), 10 లక్షల అదనపు జనాభాకు మరొక రక్షణ వాహనం చొప్పున ఉండాలి.

మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లోని అతిముఖ్యమైన నాలుగు నగరాల్లో జనాభా ప్రాతిపదికన 163 అగ్ని మాపక వాహనాలు అవసరంకాగా, కేవలం 24 అగ్ని మాపక వాహనాలు మాత్రమే ఉన్నాయి (కొరత : 85 శాతం). 10 రక్షణ వాహనాలు అవసరంకాగా, ఒక్కటి మాత్రమే ఉంది. ఆ వివరాలను ఈ కింది పట్టికలో చూపడమైంది.

**పట్టిక 2.4**

| నగరం | జనాభా* (లక్షల్లో) | అగ్నిమాపక వాహనాలు | | | రక్షణ వాహనాలు | | |
|---|---|---|---|---|---|---|---|
| | | R | A | S | R | A | S |
| హైదరాబాద్ | 55.34 | 110 | 12 | 98 | 6 | 1 | 5 |
| విశాఖపట్నం | 13.29 | 26 | 5 | 21 | 2 | - | 2 |
| విజయవాడ | 10.11 | 20 | 5 | 15 | 1 | - | 1 |
| తిరుపతి | 3.50 | 7 | 2 | 5 | 1 | - | 1 |
| మొత్తం | | **163** | **24** | **139** | **10** | **1** | **9** |

* 2001 జనాభా లెక్కల ప్రకారం; R: ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం అవసరమైనవి; A: ఉన్నవి; S: కొరత

*మూలం : జిల్లా అగ్నిమాపక అధికారుల రికార్డులు*

ఐతే, ఆడిట్‌లో మచ్చుకు తనిఖీ చేసిన ఫైర్‌స్టేషన్లన్నింటిలోనూ శ్వాస ఉపకరణాలు, డ్రాగన్ లైట్లు, రక్షణ చర్యల్లో వాడే తాళ్ళు మొదలైనవి అందుబాటులో ఉన్నాయి.

### *(ఎ) అగ్నిమాపక వాహనాలు*

- విజయవాడ, అజిత్‌సింగ్‌నగర్‌లోని ఫైర్‌స్టేషన్‌లో 2005 నుండి అగ్ని మాపక వాహనం లేదు. నీళ్లు నింపడానికి, వదలడానికి ఒక పోర్టబుల్ పంపుతో కూడిన ఒక నీళ్ల ట్యాంకరు లారీతోనే ఈ ఫైర్‌స్టేషన్ తన విధులను నిర్వర్తిస్తోంది. అధిక జనసాంద్రతగల విజయవాడ వంటి నగరంలో అగ్ని మాపక వాహనం లేకుండా ఫైర్‌స్టేషన్‌ను నిర్వహించడం అత్యంత ప్రమాదకరం.
- చిత్తూరు జిల్లాలోని ములకల చెరువు, కృష్ణాజిల్లాలోని కంచికచర్ల ఫైర్‌స్టేషన్లలో అగ్ని మాపక వాహనాలను నిరర్థకమైనవిగా 2009లో నిర్ధారించారు. కానీ, 2012 జూన్ నాటికి వీటి స్థానంలో కొత్తవి ప్రవేశపెట్టలేదు; అత్యవసర పరిస్థితుల్లో 5 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉన్న ఫైర్‌స్టేషన్లనుండి అగ్ని మాపక వాహనాలను పిలుస్తున్నారు.

[15] కృష్ణా-4, మహబూబ్‌నగర్-1, రంగారెడ్డి-1, వైఎస్ఆర్ (కడప)-3

- పైన ప్రస్తావించిన ప్రదేశాల్లో 2007-12 మధ్యకాలంలో భారీ అగ్నిప్రమాదాలు సంభవించి ₹7.82 కోట్ల విలువగల ఆస్తికి నష్టం వాటిల్లింది. (అజిత్‌సింగ్‌నగర్ : ₹7.35 కోట్లు, ములకల చెరువు : ₹0.31 కోట్లు, కంచికచర్ల : ₹0.15 కోట్లు). ఫైర్‌స్టేషన్లలో అగ్నిమాపక వాహనాలు లేనందువలన నష్టాన్ని తగ్గించడం సాధ్యపడలేదు.

అగ్నిమాపక వాహనాల కొనుగోలుకు 2012-13 లో ప్రభుత్వం నిధులను కేటాయించిందనీ, వాటి కొనుగోలు తాలూకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందనీ డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### *(బి) స్కై లిఫ్టులు*

అగ్నిమాపక, అత్యవసర సేవలశాఖ 2009 మార్చిలో ₹9.95 కోట్ల ఖర్చుతో మూడు బ్రాంటో స్కైలిఫ్టులను[16] కొనుగోలుచేసి సికింద్రాబాద్, విశాఖపట్నం, రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థ (హైదరాబాద్)ల వద్ద వీటిని ఉంచింది. ఈ లిఫ్టులను వాటి పూర్తి సామర్థ్యం మేరకు ఉపయోగించాలంటే 14,000 లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంగల హై ప్రెజర్ పంపుతో కూడిన అగ్నిమాపక యంత్రం(ఫైర్ టెండర్) కావాలి. ఐతే, హై ప్రెజర్ పంపుతో కూడిన ఒక్క ఫైర్ టెండర్‌ను మాత్రమే డిపార్టుమెంటు కొనుగోలు చేసింది (2009 జూలై).

ఈ పరికరాలను కొనుగోలుచేసే బాధ్యతను ఏపీహెచ్ఎమ్‌హెచ్ఐడీసీ[17] కి అప్పగించగా, ఈ సంస్థ 2010 అక్టోబరులో నిధులను డిపార్టుమెంటుకు వాపసు చేసింది. డీజీఎఫ్ఎస్ కొనుగోలు ప్రక్రియను 2011 నవంబరులో ప్రారంభించగా 2012 నవంబరు నాటికీ ఫైర్ టెండర్ల కొనుగోలు పూర్తికాలేదు.

బ్రాంటో స్కైలిఫ్టుల సహాయంతో నిర్వహించే అగ్నిమాపక సేవలకు కొనుగోలు చేయాల్సిన ఫైర్ టెండర్లకు సంబంధించి ఎలాంటి ప్రమాణాలనూ నిర్దేశించలేదని డీజీ ఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు). బ్రాంటో స్కైలిఫ్టులకు (54 మీటర్ల ఎత్తుకు) నీటిని సరఫరా చేసేందుకు 14,000 లీటర్ల సామర్థ్యంగల వాటర్ టెండర్ కావాలని ఫైర్ టెండర్ల ఫ్యాబ్రికేషన్‌కు సంబంధించిన టెక్నికల్ బిడ్ స్పెసిఫికేషన్లలో డిపార్టుమెంటు పేర్కొనడం జరిగింది. కాబట్టి డీజీఎఫ్ఎస్ సమాధానం అంగీకారయోగ్యంకాదు.

### *(సి) ప్రథమ చికిత్స కిట్లు*

మంటలనార్పే ప్రక్రియ ప్రమాదంతో కూడుకున్నది కాబట్టి అగ్ని మాపక వాహనంలో ప్రథమ చికిత్స కిట్ ఉండడమనేదికూడా ఒక ప్రధాన అవసరం. మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాలోని ఏ ఒక్క ఫైర్‌స్టేషన్‌లోనూ అగ్ని మాపక వాహనంతోపాటుగా ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

నిధుల లభ్యతను బట్టి భవిష్యత్‌లో ప్రథమ చికిత్స కిట్లను కొనుగోలు చేస్తామని డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### సిబ్బంది నివాస గృహాలు

ఫైర్‌స్టేషన్ల ప్రాంగణంలోనే సిబ్బందికి నివాసగృహాలను కేటాయించి అన్ని సమయాల్లోనూ వారి సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాలు నిర్దేశిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి ప్రకారం, అగ్నిమాపక సేవల సిబ్బందికి అద్దె వసూలు చేయకుండా ఉచిత వసతిని ఏర్పాటు చేయాలి.

---

[16] వోల్వో ఎఫ్ఎమ్ 340 6X4 చాసిస్‌పై ఉంచిన హైడ్రాలిక్ ప్లాట్‌ఫామ్ కమ్ టర్న్‌టేబుల్ ల్యాడర్ (నిచ్చెన)

[17] ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, వైద్య, గృహ నిర్మాణ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ. ఈ సంస్థ పేరును 2011 ఫిబ్రవరిలో ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలికవసతుల అభివృద్ధి సంస్థగా మార్చారు

రంగారెడ్డి జిల్లాలోని వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తిలో తప్ప మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని మరే ఇతర ఫైర్‌స్టేషన్లలోనూ సిబ్బంది నివాసానికి స్టాఫ్ క్వార్టర్లు లేవు. ఈ రెండు ఫైర్‌స్టేషన్లలోని స్టాఫ్ క్వార్టర్లు శిధిలావస్థలో ఉన్న కారణంగా వీటినికూడా నివాసానికి వినియోగించడంలేదు.

పై ఆడిట్ పరిశీలనలను డీజీ ఎఫ్ఎస్ అంగీకరించారు. నిధుల కొరత వలన స్టాఫ్ క్వార్టర్లను నిర్మించలేక పోయామని, దీనికి సంబంధించి తగిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు (2012 నవంబరు).

### విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు

ప్రతి ఫైర్‌స్టేషన్‌లోనూ కనీస సౌకర్యాలతో కూడిన ఒక విశ్రాంతి గది ఉండాలని ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాలు, ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి నిర్దేశిస్తున్నాయి.

మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని 85 ఫైర్‌స్టేషన్లకుగానూ, 21 ఫైర్‌స్టేషన్లలో (25 శాతం) విశ్రాంతి గదులు లేవు; 22 ఫైర్‌స్టేషన్లలో (25 శాతం) మరుగుదొడ్లు లేవు ; మిగిలిన ఫైర్‌స్టేషన్లలో ఉన్న విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు కింది ఫోటోలలో చూపిన విధంగా ఉపయోగకర పరిస్థితిలో లేవు.


*పరిగి ఫైర్ స్టేషన్‌లోని విశ్రాంతి గది (2011 సెప్టెంబరు 17)*


*నర్సీపట్నం ఫైర్ స్టేషన్‌లోని మరుగుదొడ్డి (2012 జనవరి 4)*

ఫైర్‌స్టేషన్లకు భవనాలతోపాటు విశ్రాంతి గదులు, మరుగుదొడ్లను నిర్మించడానికి 2012-13 లో ప్రభుత్వం నిధులను కేటాయించినందున త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### సమాచార వ్యవస్థ

అగ్ని ప్రమాదం జరుగుతున్న ప్రదేశానికి వీలైనంత తొందరగా చేరుకోగలగడాన్నిబట్టి అగ్నిమాపక సేవల సమర్థత వెల్లడవుతుంది. ఎస్ఎఫ్ఏసీ ప్రమాణాల ప్రకారం పట్టణ ప్రాంతాల్లో 5 నిముషాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లో 20 నిముషాల్లోనూ చేరుకోగలగాలి.

దీనికి సంబంధించి, ఆడిట్ పరిశీలనలు ఈ కింది విధంగా ఉన్నాయి :

- అగ్ని ప్రమాదానికి గురైనచోటును ఖచ్చితంగా గుర్తించేందుకు గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీ పీఎస్) డిపార్టుమెంటు వద్ద లేదు. డీజీఎఫ్ఎస్ ఈ విషయాన్ని అంగీకరిస్తూ నిధులు అందుబాటులో ఉంటే భవిష్యత్‌లో దీన్ని కొనుగోలు చేస్తామని తెలిపారు.

- విపత్తులనెదుర్కొనే చర్యల నిర్వహణ వ్యూహంలో భాగంగా అత్యధిక పౌనఃపున్యం (వీహెచ్ఎఫ్) గల సమాచార అనుసంధాన వ్యవస్థను నెలకొల్పడానికి ప్రభుత్వం ₹4.33 కోట్లు మంజూరు చేసింది (జనవరి/ ఫిబ్రవరి 2009). డిపార్టుమెంటు 10,567 వీహెచ్ఎఫ్ సెట్లను 2009 ఫిబ్రవరి/మార్చిలో కొనుగోలు చేసి, రాష్ట్రంలోని జిల్లా అగ్నిమాపక సేవల అధికారులందరికీ 2009 నవంబరు-2010 ఏప్రిల్ మధ్య పంపిణీ చేసింది. అన్ని ఫైర్‌స్టేషన్లలోనూ వీహెచ్ఎఫ్ సెట్లను వినియోగిస్తున్నామని డీజీ ఎఫ్ఎస్ తన సమాధానం

(2012 నవంబరు)లో పేర్కొన్నప్పటికీ, లైసెన్సులు రాని కారణంగా మచ్చుకు తనిఖీ చేసిన ఫైర్‌స్టేషన్లలో విజయవాడ నగరంలో తప్ప మరే ఇతర ఫైర్‌స్టేషన్‌లోనూ వీహెచ్‌ఎఫ్ సెట్లను వినియోగించడంలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

అగ్నిమాపక సేవలు, విపత్తుల స్పందన శాఖ, పరికరాలను కొనుగోలు చేయడానికి ముందే లైసెన్సులను పొందే ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు చేపట్టకపోవడం వలన రాష్ట్రమంతా సమాచార అనుసంధాన వ్యవస్థను నెలకొల్పాలన్న లక్ష్యం నెరవేరకపోగా దీనిపై పెట్టిన పెట్టుబడి నిష్ఫలమయింది.

## 2.5.2 అగ్ని మాపక సేవల నిర్వహణ

### *2.5.2.1 ఫైర్ కాల్స్‌కు స్పందన*

ఫైర్ కాల్స్‌కు గరిష్ఠ స్పందన సమయాన్ని అభివృద్ధి చెందిన పట్టణ ప్రాంతాల్లో 5 నిముషాలుగానూ, అభివృద్ధి చెందని గ్రామీణ ప్రాంతాల్లో 20 నిముషాలుగానూ ఎస్ఎఫ్ఏసీ సిఫార్సు చేసింది.

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ఫైర్‌స్టేషన్లలోని అగ్నిమాపక సేవల నివేదికలను తనిఖీ చేయగా కిలోమీటరుకు రెండు నిముషాల చొప్పున లెక్కించి స్పందన సమయాన్ని తెలిపేచోట రాసారని వెల్లడైంది. రోడ్డు పరిస్థితులు, ట్రాఫిక్ రద్దీ వంటి వివిధ అంశాల ఆధారంగా ఒక్కొక్క కేసులోనూ వాస్తవంగా పట్టిన సమయాన్ని నమోదు చేయలేదు. పట్టణ ప్రాంతాల్లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదాలు[18], పెద్ద అగ్ని ప్రమాదాలలో 362 సంఘటనలను ఆడిట్‌లో సమీక్షించగా 66 (18 శాతం) కేసులలో నిర్దేశిత 5 నిముషాలలోపే స్పందన సమయం నమోదయ్యింది. మిగిలిన 296 కేసులలో స్పందన సమయం 6 నుండి 70 నిముషాలు (బహదూర్‌గూడ, హైదరాబాద్) వరకు ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన 492 అగ్ని ప్రమాదాలకుగానూ 137 (28 శాతం) కేసులలో నిర్దేశిత 20 నిముషాల లోపు, మిగిలిన 355 కేసులలో 28 నిముషాలనుండి 152 నిముషాలు (పెబ్బేరు మండలం, తాటిపాముల) వరకు స్పందన సమయం నమోదయ్యింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సంవత్సరాలవారీగా కేసుల వివరాలను ఈ కింది పట్టికలో చూపడమైంది.

**పట్టిక 2.5**

పట్టణ ప్రాంతాలు

| సంవత్సరం | మచ్చుకు తనిఖీ చేసిన కేసులు | స్పందన సమయం నిర్దేశిత 5 నిముషాలలోపు ఉన్నవి (శాతం) | స్పందన సమయంలో జాప్యం ఉన్నవి | | | |
|---|---|---|---|---|---|---|
| | | | 6-10 నిముషాలు (శాతం) | 11-20 నిముషాలు (శాతం) | 21-30 నిముషాలు (శాతం) | 30 నిముషాలకు పైగా (శాతం) |
| **2006** | 67 | 8 (12) | 27 (40) | 24 (36) | 5 (7) | 3 (4) |
| **2007** | 75 | 12 (16) | 28 (37) | 25 (33) | 7 (9) | 3 (4) |
| **2008** | 90 | 12 (13) | 29 (32) | 37 (41) | 10 (11) | 2 (2) |
| **2009** | 66 | 18 (27) | 19 (29) | 18 (27) | 4 (6) | 7 (11) |
| **2010** | 48 | 14 (29) | 10 (21) | 20 (42) | - | 4 (8) |
| **2011** | 16 | 2 (13) | 5 (31) | 4 (25) | 4 (25) | 1 (6) |
| మొత్తం | **362** | **66 (18)** | **118 (33)** | **128 (35)** | **30 (8)** | **20 (6)** |

[18] ఘోర అగ్ని ప్రమాదాలు: ₹10 లక్షల నుండి ₹25 లక్షల ఆస్తి నష్టం జరిగిన సంఘటనలు లేదా ఆస్తి నష్టం తీవ్రతతో సంబంధం లేకుండా, ప్రాణ నష్టం జరిగిన సంఘటనలు పెద్ద అగ్ని ప్రమాదాలు: ₹ 25 లక్షలు, అంతకంటే ఎక్కువ ఆస్తి నష్టం జరిగిన సంఘటనలు

గ్రామీణ ప్రాంతాలు

| సంవత్సరం | మచ్చుకు తనిఖీ చేసిన కేసులు | స్పందన సమయం నిర్దేశిత 20 నిముషాలలోపు ఉన్నవి (శాతం) | స్పందన సమయంలో జాప్యం ఉన్నవి | | |
|---|---|---|---|---|---|
| | | | 21-30 నిముషాలు (శాతం) | 31-60 నిముషాలు (శాతం) | 60 నిముషాలకు పైగా (శాతం) |
| 2006 | 66 | 20 (30) | 14 (21) | 23 (35) | 9 (14) |
| 2007 | 90 | 16 (18) | 26 (29) | 28 (31) | 20 (22) |
| 2008 | 90 | 18 (20) | 21 (23) | 36 (40) | 15 (17) |
| 2009 | 90 | 27 (30) | 32 (36) | 24 (27) | 7 (8) |
| 2010 | 84 | 24 (29) | 22 (26) | 32 (38) | 6 (7) |
| 2011 | 72 | 32 (44) | 18 (25) | 19 (26) | 3 (4) |
| మొత్తం | 492 | 137 (28) | 133 (27) | 162 (33) | 60 (12) |

*మూలం : జిల్లా అగ్ని మాపక సేవల అధికారులు*

(i) పనిభారం అధికంగా ఉండటం, (ii) అత్యంత ప్రముఖుల పర్యటనలు, జాతరలు, ప్రదర్శనల సమయంలో ముందు జాగ్రత్త చర్యల విధులకు హాజరు కావడం, (iii) ఫైర్ స్టేషన్లు సరిపడినన్ని లేకపోవడంవలన స్పందన సమయం ఎక్కువగా ఉందని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

### *2.5.2.2 భద్రతా ప్రమాణాల అమలు*

భద్రతా ప్రమాణాలను అమలు చేయడం, అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలపట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, ముఖ్యంగా ప్రమాదకర పరిస్థితులున్న ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలను బాగా తగ్గించడం అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖ విధుల్లో ఒక కీలకమైన అంశం.

#### అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన భద్రతా చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించడం

అగ్ని ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రమాదకర ప్రాంగణాలను గుర్తించి అవగాహనా కార్యక్రమాలను నిర్వహించే విషయంలో డీఎఫ్ఓలు, ఏడీఎఫ్ఓలు, ఎస్ఎఫ్ఓలకు డీజీఎఫ్ఎస్ నెలవారీ లక్ష్యాలను నిర్ణయిస్తారు. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో (వైఎస్ఆర్ (కడప) జిల్లాలోనూ, హైదరాబాద్ జిల్లాలో కొన్ని కేసులూ తప్ప) ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతల గురించి అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టినట్లు చూపే ఆధారాలను అగ్నిమాపక సేవల శాఖ సమర్పించలేదు.

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టంలోని 8వ సెక్షను ప్రకారం, ప్రజలనుండి వాలంటీర్లను చేర్చుకోవడం ద్వారా సహాయక సేవలను(ఆక్జిలరీ సర్వీసులు) పెంపొందించుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో, అంటే, ప్రమాదం సంభవించిన వెనువెంటనే అగ్నిమాపక సేవల శాఖ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకోకముందే ఈ వాలంటీర్లు మంటలనార్పే పని చేపట్టి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నియంత్రించాలి. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని ఏ ఒక్క జిల్లాలోనూ 2012 నవంబరు నాటికి సహాయక సేవల ఏర్పాటు జరగలేదని ఆడిట్ పరిశీలనలో గమనించడమైంది.

అగ్ని ప్రమాదాల గురించి సకాలంలో సమాచారమందించిన వారికీ, మంటలను ఆర్పే చర్యలోనూ రక్షణ కార్య కలాపాల్లోనూ అగ్నిమాపక సేవల శాఖ సిబ్బందికి సహాయపడిన వారికీ బహుమతులివ్వాలని కూడా ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం నిర్దేశిస్తోంది. ఐతే, ఆడిట్ నిర్వహించిన జిల్లాల్లోని ఏ ఒక్క డీఎఫ్ఓఅలాంటి వారిని గుర్తించడంకానీ, అగ్ని ప్రమాదాల నివారణ, భద్రత చర్యల్లో పాల్గొనేలా ప్రజలను ప్రోత్సహించడానికి వారికి బహుమతులనివ్వడంగానీ చేయలేదు.

### ప్రమాదకర ప్రాంగణాల తనిఖీ, లైసెన్సుల జారీ

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి - 2006 లోని నియమం18 (2), ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టం - 1999 లోని 15వ సెక్షను ప్రకారం, అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే ఆస్కారమున్న ప్రాంగణాల యజమాని/అందులో నివసించే వ్యక్తి నిర్దేశిత రుసుము చెల్లించి సంబంధిత అధికారి నుండి లైసెన్సును పొందాలి. అంతేకాక, అగ్నిమాపక సేవల శాఖ ప్రమాదకర ప్రాంగణాలన్నింటినీ తనిఖీచేసి భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నారనే విషయాన్ని రూఢీ చేసుకోవాలి.

ఎంపిక చేసుకున్న ఏడు జిల్లాల్లో, ప్రమాదకర ప్రాంగణాల తనిఖీలు, లైసెన్సుల జారీలకు సంబంధించి ఆడిట్ పరిశీలనలో ఈ కింది విషయాలను గమనించడమైంది ః

- ఏదైనా సర్వే చేపట్టడం ద్వారాకానీ, వైద్య, విద్య, పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, రెవెన్యూ, పౌర సరఫరాలు మొదలైన ప్రభుత్వ శాఖల సమన్వయంతోకానీ డీఎఫ్ఓలు తమ పరిధిలోని ప్రమాదకర ప్రాంగణాలను గుర్తించడంకానీ వాటి వివరాలను పొందడంకానీ చేయలేదు. కొన్ని జిల్లాల్లో ప్రమాదకర ప్రాంగణాలను పాక్షికంగా గుర్తించినప్పటికీ మరికొన్ని జిల్లాల్లో వీటిని గుర్తించే ప్రయత్నమేదీ చేయలేదు. వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

| | |
|---|---|
| హైదరాబాద్ జిల్లా | 363 విద్యా సంస్థలు, 91 ఆసుపత్రులు, 69 థియేటర్లను గుర్తించారు. |
| విశాఖపట్నం జిల్లా | షాపింగ్ మాళ్లు, డిపార్టుమెంటల్ స్టోర్లను గుర్తించలేదు. |
| వైఎస్ఆర్ (కడప) జిల్లా | 464 విద్యా సంస్థలు, 40 ఆసుపత్రులు, 69 థియేటర్లను గుర్తించారు. |
| చిత్తూరు, కృష్ణా, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలు | ప్రమాదకర ప్రాంగణాల గుర్తింపు జరగలేదు. |

- రాష్ట్రంలో 50,007 ప్రాంగణాలను ప్రమాదకరమైనవిగా గుర్తించగా, డీఎఫ్ఓలు 19,129 (38 శాతం) ప్రాంగణాలను మాత్రమే తనిఖీచేశారు. ప్రమాదకర ప్రాంగణాలుగా గుర్తించిన కళాశాలలు, పాఠశాలలు, హోటళ్ళు, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, షోరూమ్‌లు మొదలైన వాటిలో తనిఖీలు జరిగింది 9 నుండి 48 శాతం. వివరాలను ఈ కింద ఇవ్వడమైంది.

పట్టిక 2.6

| క్యాటగిరి | ప్రమాదకర ప్రాంగణాల సంఖ్య | |
|---|---|---|
| | గుర్తించినవి | డీఎఫ్ఓలు తనిఖీ చేసినవి (శాతం) |
| కళాశాలలు | 11875 | 2377 (20) |
| పాఠశాలలు | 9716 | 4629 (48) |
| హోటళ్ళు | 1674 | 772 (46) |
| ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు (15 మీటర్లకంటే తక్కువ) | 2712 | 1006 (37) |
| చిన్న తరహా పరిశ్రమలు | 5048 | 1408 (28) |
| భారీ, మధ్యతరహా పరిశ్రమలు | 1887 | 335 (18) |
| ఔషధ పరిశ్రమలు | 130 | 22 (17) |
| జ్యూట్ మిల్లులు | 69 | 25 (36) |
| కమర్షియల్ షోరూమ్‌లు | 689 | 124 (18) |
| టింబరు డిపోలు/సా మిల్లులు | 2093 | 784 (37) |
| టోకు వర్తక దుకాణాలు | 2286 | 215 (9) |
| ఫంక్షన్ హాళ్ళు | 1486 | 606 (41) |

*మూలం: డీజీఎఫ్ఎస్ రికార్డులు*

- ప్రమాదకర ప్రాంగణాలకు లైసెన్సుల మంజూరుకోసం తమంతట తాముగా ముందుకువచ్చిన యజమానులు/ నివాసితుల నుండి మాత్రమే లైసెన్సు ఫీజును వసూలు చేసారు. లైసెన్సు ఫీజుల వసూలు, నవీకరణలకు సంబంధించి డిమాండు, వసూలైన, బకాయి ఉన్న మొత్తాల వివరాలను నమోదు చేయాల్సిన డీసీబీ రిజిస్టర్లను డీఎఫ్ఓలు నిర్వహించలేదు.

ప్రమాదకర ప్రాంగణాలను తనిఖీచేయడం, అగ్నిప్రమాదాల నివారణకు భద్రతాపరంగా చేపట్టాల్సిన చర్యల్లో లోపాలుంటే వాటిని సరిదిద్దేందుకు నోటీసులను జారీచేయడం, భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించేవారిని ప్రాసిక్యూట్ చేసేందుకు చర్యలు చేపట్టడంలో నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు). ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రమాదకర పరిస్థితులున్న భవనాలను గుర్తించాలని, డీసీబీ రిజిస్టర్లను నిర్వహించాలని సంబంధిత డీఎఫ్ఓలకు ఆదేశాలు జారీ చేశామనికూడా డీజీఎఫ్ఎస్ తెలిపారు.

### ఎత్తైన భవనాలకు నిరభ్యంతర పత్రాల జారీ

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి - 2006 లో నిర్దేశించిన ప్రకారం, వాణిజ్య ప్రయోజనాలకు 15 మీటర్లకంటే ఎత్తైన భవనాలు, నివాసం కోసం 18 మీటర్లు, అంతకుమించి ఎత్తైన భవనాలు, 500 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం, 6 మీటర్లు కంటే ఎక్కువ ఎత్తున్న సినిమాహాళ్ళవంటి జన సమ్మర్దం అధికంగా ఉండే భవనాలు నిర్మించతలపెట్టిన వ్యక్తులు అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖనుండి నిరభ్యంతర పత్రాన్ని (ఎన్ఓసీ) పొందాలి. దరఖాస్తు అందిన 60 రోజులలోపు అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖ నిర్మాణ స్థలాన్ని తనిఖీచేసి ఏడాదిపాటు చెల్లుబాటులో ఉండే తాత్కాలిక నిరభ్యంతర పత్రాన్ని (ప్రొవిజనల్ ఎన్ఓసీ) జారీ చేయాలి. అగ్నిమాపక, అత్యవసర సేవల శాఖ సూచించిన విధంగా నిర్మాణంలో మార్పులు, భద్రతా పరికరాల ఏర్పాటు జరిగిన తర్వాత ఆ భవనానికి ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ను జారీ చేయాలి. చట్ట నిబంధన లను పాటించారని నిర్ధారించుకోవడానికి చేసే పర్యవేక్షణకు వీలుకల్పించేలా వాచ్ రిజిస్టర్లను నిర్వహించాలి.

ఆడిట్ పరిశీలనలో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- జారీ చేసిన ఎన్ఓసీలు, వాటి నవీకరణ, బ్యాంకు గ్యారంటీలు, డీసీబీలగురించి మహబూబ్నగర్ జిల్లాలో తప్ప మరెక్కడా డిపార్టుమెంటు వాచ్ రిజిస్టర్లను నిర్వహించలేదు. దీనివల్ల జారీ చేసిన ఎన్ఓసీలు, నవీకరించినవి, ఇంకా నవీకరించాల్సినవి ఎన్ననే విషయాన్ని ఆడిట్లో నిర్ధారించుకోవడం వీలుకాలేదు.
- బహుళ అంతస్తుల భవనాలకు ఎన్ఓసీలను డీజీఎఫ్ఎస్ నేరుగా జారీ చేసినందువల్ల మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లోని డీఎఫ్ఓలకు తమ పరిధిలో ఎన్ఓసీలు జారీ అయిన బహుళ అంతస్తుల భవనాల గురించి తెలియదు.
- ఎత్తైన భవనాలు నిర్మించాలని ప్రతిపాదించిన వ్యక్తులు అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతలకోసం ఏర్పాట్లు చేయడాన్ని రూఢీ చేసుకునేందుకు వారివద్దనుండి బ్యాంకు గ్యారంటీలను తీసుకోవడం జరుగుతుంది. కానీ, ఈ బ్యాంకు గ్యారంటీల (బీజీలు) చెల్లుబాటు గడువును గమనించేందుకు డీజీఎఫ్ఎస్ ఎలాంటి వాచ్ రిజిస్టర్లను నిర్వహించడం లేదు. 2007-12 మధ్యకాలంలో ₹4.28 కోట్ల విలువగల 14 బీజీలకు చెల్లుబాటు గడువు ముగిసిపోయింది. సంబంధిత భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్లు ఇంకా జారీ చేయలేదు. కానీ, 2012 జూన్ నాటికి ఈ బీజీల చెల్లుబాటును నవీకరించలేదు.
- విశాఖపట్నం ప్రాంతీయ విజిలెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ అధికారి, నివేదిక ఆధారంగా 18 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న 145 బహుళ అంతస్తుల భవనాలను (నివాసాలకోసం నిర్మించినవి) తనిఖీ చేయమని విశాఖపట్నం డీఎఫ్ఓను 2007 నవంబరులో డీజీఎఫ్ఎస్ ఆదేశించారు. 125 బహుళ అంతస్తుల భవనాలు ఎన్ఓసీలను పొందలేదనీ, నేషనల్ బిల్డింగ్ కోడ్లో నిర్దేశించిన విధంగా అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతా ప్రమాణాలను ఇవి పాటించలేదనీ డీఎఫ్ఓ తన నివేదికలో పేర్కొన్నారు (2007 డిసెంబరు). అగ్ని మాపక

సేవల జాగ్రత్తలకు సంబంధించిన ఫీజు ₹44.58 లక్షలు[19] వసూలు చేయలేదని కూడా తెలిపారు. ఐతే, డీఎఫ్ఓ నివేదికపై 2012 నవంబరు నాటికి డీజీఎఫ్ఎస్ ఎలాంటి చర్యలూ చేపట్టలేదు.

ఎన్ఓసీలు జారీ చేసిన ప్రాంగణాలన్నింటినీ ప్రస్తుత సంవత్సరం (2012-13) లో తనిఖీ చేస్తామని డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

హైదరాబాద్ నగరంలోని రెండు బహుళ అంతస్తుల భవన సముదాయాల ఏర్పాటు, నిర్వహణకు సంబంధించి ఆడిట్ పరిశీలనలో ఈ కింది లోపాలను గమనించడమైంది :

**(i)** మల్టీప్లెక్స్ థియేటర్లు, దుకాణాల సముదాయంతో కూడిన బహుళ అంతస్తుల భవనానికి డీజీ ఎఫ్ఎస్ 2005 నవంబరులో ప్రొవిజనల్ ఎన్ఓసీ జారీ చేసారు. బిల్డరు నిర్దేశిత నిబంధనలను పాటించని కారణంగా, 2006 మేలో దీన్ని రద్దు చేసారు. ఐతే, అగ్నిమాపక సేవల శాఖ ఎన్ఓసీని రద్దు చేసిందన్న వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకోకుండా 2007 జూన్‌లో జీ హెచ్ఎమ్‌సీ[20] బిల్డరుకు ఆక్యుపెన్సీ సర్టిఫికేట్‌ను జారీ చేసింది. యాడ్ లాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు ఈ భవనంలోని నాలుగో అంతస్తులో మూడు తెరలకు (రెండవ, మూడవ, నాలుగవ తెరలకు) సినిమా ప్రదర్శనకు హోమ్ శాఖ 2008 మార్చిలో అనుమతిస్తూ మరోసారి సమీక్షించిన తర్వాత ఒకటవ తెరకు లైసెన్సు మంజూరు చేస్తామని షరతు విధించింది. దీని ఆధారంగా లైసెన్సు జారీచేసే అధికారి అయిన పోలీసు కమీషనరు మూడు తెరలకు 2008 మేలో లైసెన్సు జారీ చేసారు. ఐతే, అగ్ని ప్రమాదాల నివారణ, భద్రత ఏర్పాట్లు లోపభూయిష్టంగా ఉన్నాయని గమనించిన డీజీఎఫ్ఎస్ ఈ భవనానికి ఇచ్చిన ఓసీని తాత్కాలికంగా ఉపసంహరించే అంశాన్ని పరిగణించాలని 2011 జూన్‌లో ప్రభుత్వానికి సూచించారు. ఐతే, 2012 జూన్ నాటికి ఓసీని రద్దు చేయలేదు. ఈ బహుళ అంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదాల నివారణ కోసం భద్రతా ఏర్పాట్లు అమలయ్యేలా చూసేందుకు ఎలాంటి చర్యా తీసుకోలేదు. ఫైర్ ప్రికాషన్ ఫీజు, నిర్మాణం జరిగిన రోజునుండి అగ్ని మాపక సేవల శాఖ నుండి ఎన్ఓసీ పొందేనాటి వరకు/సాలుకు 24 శాతం చొప్పున అపరాధ వడ్డీని వసూలు చేసేందుకు కూడా చర్యలు చేపట్టలేదు. ఈ అంశాలను ఆడిట్‌లో లేవనెత్తినపుడు వీటిని పరిష్కరిస్తామని డీజీ ఎఫ్ఎస్ హామీ ఇచ్చారు.

**(ii)** నాలుగు తెరల మల్టీప్లెక్స్ థియేటరు ఉన్న 'హైదరాబాద్ సెంట్రల్' అనే బహుళ అంతస్తుల షాపింగ్ మాల్‌కు నిర్దిష్ట నిబంధనలను బిల్డరు పాటిస్తే, ఎన్ఓసీ జారీ చేయని హోమ్ శాఖ 2005 నవంబరులో డీజీఎఫ్ఎస్‌ను ఆదేశించింది[21]. ప్రభుత్వం నిర్దేశించిన షరతులను పేర్కొనకుండానే అగ్ని మాపక సేవల శాఖ ఎన్ఓసీని జారీచేసింది. మూడు తెరలపై (ఒకటవ, రెండవ, ఐదవ తెరలపై) సినిమా ప్రదర్శనలకు మాత్రమే ఎన్ఓసీని జారీ చేయడమైందని, మూడవ, నాలుగవ తెరలపై సినిమా ప్రదర్శనలు జరగటం లేదని ప్రభుత్వం సమాధానమిచ్చింది. ఇది ప్రత్యేకంగా సినిమా థియేటరుగా మాత్రమే ఉన్న భవనంకాదు; పై అంతస్తులో ఐదు థియేటర్లు ఉన్న ఎనిమిది అంతస్తుల భవనం. జాతీయ భవన నిర్మాణాల స్మృతి (నేషనల్ బిల్డింగ్ కోడ్) 1990లో నిర్దేశించిన ప్రమాణాల ఆధారంగా మాత్రమే ఇలాంటి భారీ నిర్మాణానికి ఎన్ఓసీని జారీచేయాలి. ఈ కేసులో, నిర్దేశిత ప్రమాణాలు పాటించకుండా, ఆంధ్రప్రదేశ్ సినిమాల (నియంత్రణ) నియమావళి-1970 కింద ఎన్ఓసీని జారీ చేసారు. కానీ ఇది ఈ కేసుకు వర్తించదు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు సంబంధించిన భద్రతా ప్రమాణాలను పాటించే విషయంలో నియమాలను వర్తింపచేయకపోవడం, సడలించడం హైదరాబాద్‌లోని పంజాగుట్ట వంటి అధిక జన సమ్మర్దం ఉండే ప్రాంతంలో ప్రజా భద్రతకు ప్రమాదకరం.

[19] ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి-2006 లోని 15(సి) నియమం ప్రకారం నిర్మాణం జరిగిన విస్తీర్ణానికి (బిల్టప్ ఏరియా) చదరపు మీటరుకు ₹10 చొప్పున

[20] గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషను

[21] ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హోమ్(జనరల్ ఎ) శాఖ 2005 నవంబరు 9 వతేదీనాడు జారీచేసిన జీవో ఎంఎస్ నెం.239

### ఉన్నత అధికారాల సంఘం సిఫార్సుల అమలు

ఉన్నత అధికారాల సంఘం (హైపవర్ కమిటీ[22]) 2006 డిసెంబరులో చేసిన సిఫార్సులను అనుసరించి అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన భద్రతా ప్రమాణాలను పాటించని బహుళ అంతస్తుల భవనాలు/ సముదాయాల (ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల చట్టంలోని 13వ సెక్షను కిందకు వచ్చేవి కాకుండా) యజమానులకు/వాటిలో ఉంటున్న వారికి నోటీసులు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది (2007 మార్చి). దీనికి అనుగుణంగా, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, వరంగల్ నగరపాలక సంస్థల్లో అగ్ని ప్రమాదాల నిరోధక విభాగాలను (ఫైర్ ప్రివెన్షన్ వింగ్‌లను) ఏర్పాటు చేసింది[23] (2009 ఫిబ్రవరి).

ఐతే, ఇతర నగరపాలక సంస్థల్లో అగ్ని ప్రమాదాల నిరోధక విభాగాలు ఏర్పాటు చేయడానికి ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. ఇతర నగరపాలక సంస్థల పరిధిలోని ఎత్తైన భవనాల క్యాటగిరీ కిందకు రాని ఇతర భవనాలలో అగ్ని ప్రమాదాల నివారణకు భద్రతా ప్రమాణాలను అమలు చేయలేదు.

పన్నెండు నగరపాలక సంస్థల్లో[24] అగ్ని ప్రమాదాల నిరోధక విభాగాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి 2012 సెప్టెంబరులో ప్రతిపాదనలు పంపామనీ, ఇతర సిఫార్సులకు సంబంధించి కూడా ఆమోదం ఇంకా రావలసి ఉందనీ డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### *అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు భద్రతా ఏర్పాట్లు*

సినిమాహాళ్ళు, ఆసుపత్రులు, ఫంక్షన్‌హాళ్ళు, హోటళ్ళు, విద్యాసంస్థలవంటి బహిరంగ ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేయమని డీఎఫ్ఓలందరికీ 2007-12 మధ్య కాలంలో డీజీఎఫ్ఎస్ ఆదేశాలిచ్చారు.

2006-11 మధ్యకాలంలో చిత్తూరు, హైదరాబాద్, క్రిష్ణా, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, విశాఖపట్నం, వైఎస్ఆర్ (కడప) జిల్లాల్లో డీఎఫ్ఓలు చేసిన తనిఖీల్లో గమనించిన లోపాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

పట్టిక 2.7

| అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు భద్రతా ప్రమాణాలు/ముందు జాగ్రత్త చర్యల ఏర్పాట్లలో ఉల్లంఘనలు | ఆసుపత్రులు | థియేటర్లు | విద్యా సంస్థలు | హోటళ్ళు, పెట్రోలు బంకులు, గ్యాస్ గోడౌన్‌లు, ఫ్యాక్టరీలు, ఫంక్షన్ హాళ్ళు |
|---|---|---|---|---|
| | ప్రమాణాలను ఉల్లంఘించిన యూనిట్ల సంఖ్య (శాతం) | | | |
| డీఎఫ్ఓలు తనిఖీ చేసినవి | 911 | 651 | 932 | 681 |
| అగ్నిమాపక వాహనం భవనానికి కనీసం మూడు వైపులు సులభంగా వెళ్ళగలిగేట్లు, విధులు నిర్వహించేట్లు అనుకూలంగా లేనివి | 857 (94) | 464 (71) | 928 (100) | 681 (100) |
| ఎన్‌బీసీ ప్రమాణాలమేరకు నీటి నిల్వ ఏర్పాట్లు లేనివి | 820 (90) | 651 (100) | 932 (100) | 681 (100) |
| ఎన్‌బీసీ ప్రమాణాలమేరకు తప్పించుకునే మార్గాల ఏర్పాటు లేనివి | 830 (91) | 383 (59) | 923 (99) | 681 (100) |
| పొగ బయటకు పోవడానికి ఏర్పాట్లు, వెంటిలేటర్లు లేనివి | 911 (100) | 404 (62) | 918 (99) | 681 (100) |
| మంటలనార్పే పరికరాలు, బకెట్లు, పైపులు, నీటిని జల్లేవి మొదలైన అగ్నిమాపక ఏర్పాట్లు ఎన్‌బీసీ ప్రమాణాల మేరకు లేనివి | 873 (96) | 407 (63) | 913 (98) | 681 (100) |

[22] మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ కార్యదర్శి అధ్యక్షతన, డీజీ ఎఫ్ఎస్, హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ ఉపాధ్యక్షులు, గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక సంస్థ కమీషనరు, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రతినిధి మొదలైనవారు సభ్యులుగా ఏర్పాటైంది.

[23] మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ 2009 ఫిబ్రవరిలో జారీ చేసిన జీఓ నెం.174

[24] గుంటూరు, కాకినాడ, రాజమండ్రి, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, కడప, ఏలూరు, కరీంనగర్, నిజామాబాద్, అనంతపురం, రామగుండం

| | | | | |
|---|---|---|---|---|
| బయటకు వెళ్ళేమార్గాలు, కారిడార్లు, మెట్లమార్గాల్లో అత్యవసర పరిస్థితుల్లో వెలుతురుకోసం బ్యాటరీబ్యాక్అప్, ఆటో గ్లో ఏర్పాట్లు లేనివి | 898 (99) | 488 (75) | 932 (100) | 681 (100) |
| శిక్షణ పొందిన భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయనివి | 899 (99) | 651 (100) | 932 (100) | 669 (98) |
| ల్యాండింగ్‌లలో తెరుచుకునే కిటికీలు లేనివి | 843 (93) | 651 (100) | 932 (100) | 681 (100) |
| పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయనివి | 911 (100) | 651 (100) | 932 (100) | 681 (100) |
| ఎన్ఓసీ వివరాలు అందుబాటులో లేనివి | 909 (100) | 646 (99) | 489 (52) | 681 (100) |

*మూలం : డీజీఎఫ్ఎస్, డీఎఫ్ఓల రికార్డులు*

డీఎఫ్ఓలు తనిఖీ చేసిన 911 ఆసుపత్రుల్లో 93 నుండి 100 శాతం, 651 థియేటర్లలో 59 నుండి 100 శాతం, 932 విద్యా సంస్థల్లో 52 నుండి 100 శాతం, హోటళ్ళు, పెట్రోలు బంకులు, గ్యాస్‌గోడౌన్‌లు, ఫ్యాక్టరీలు, ఫంక్షన్‌హాళ్ళలో దాదాపు 100 శాతం అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలకు నిర్దేశించిన ప్రమాణాలను ఉల్లంఘించాయని, ముందు జాగ్రత్త చర్యలను తీసుకోలేదని పై పట్టికలోని వివరాలనుండి తెలుస్తోంది.

జన సమ్మర్దం ఉండే చోట్ల అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలకు ఏర్పాట్లుచేసే విషయంలో ప్రమాణాలను ఉల్లంఘించే వారికి శిక్షలు విధించడానికి చర్యలు తీసుకోవలసిందిగా డీజీఎఫ్ఎస్ లేదా వారి ద్వారా అధికారాలు సంక్రమించిన వ్యక్తి సంబంధిత డీఎఫ్ఓలకు ఆదేశాలు జారీ చేయాలని ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళిలోని 15వ నియమంలో నిర్దేశించడం జరిగింది.

డీజీ ఎఫ్ఎస్ నుండి నిర్దిష్టమైన ఆదేశాలు రాని కారణంగా పైన పేర్కొన్న సంస్థల యాజమాన్యాలపై డీఎఫ్ఓలు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. దీనికి సంబంధించి డీజీ ఎఫ్ఎస్ నిర్దిష్టమైన సమాధానం ఇవ్వలేదు (2012 నవంబరు). తక్షణ కఠినచర్యలు తీసుకోకపోవడం, శిక్షలు విధించకపోవడంవల్ల తనిఖీలు చేసినా ప్రయోజనం లేదు; ప్రజా భద్రత విషయంలో రాజీపడినట్లైంది.

2006-11 మధ్యకాలంలో నిర్వహించిన తనిఖీల పర్యవసానంగా సంబంధిత శాఖలు దిద్దుబాటు చర్యలను తీసుకున్నాయా లేదా అని తెలుకుకునేందుకు కొన్ని ముఖ్యమైన ప్రభుత్వ భవనాలను ఆడిట్ అగ్నిమాపక సేవల శాఖ అధికారులతో కలిసి 2012 నవంబరులో ఉమ్మడి ప్రత్యక్ష తనిఖీలను నిర్వహించడం జరిగింది. ఏడాదిన్నర తర్వాత కూడా అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లకు చర్యలు చేపట్టలేదనీ, అత్యంత సున్నితమైన ప్రదేశాలైన రాష్ట్ర సచివాలయం, శాసన సభ వంటిచోట్ల కూడా పరిస్థితిలో మార్పులేదనీ గమనించడమైంది. ఆ వివరాలను కింద పేర్కొనడం జరిగింది :

### ప్రభుత్వ భవనాలు

***ఆంధ్రప్రదేశ్ సచివాలయం, హైదరాబాద్*** - ఆంధ్రప్రదేశ్ సచివాలయం, డీ బ్లాకులో 2009 మేలో భారీ అగ్ని ప్రమాదం జరిగినప్పటికీ, ప్రభుత్వం 2012 నవంబరు నాటికీ అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలకు తగిన భద్రతా ఏర్పాట్లు అమలయ్యేలా చూడలేదు. ఆడిట్ గమనించిన అంశాలు :

- డీ బ్లాకులో హైడ్రేంట్ సిస్టమ్‌లు, పొగను కనిపెట్టి హెచ్చరించే యంత్రాలు (స్మోక్ డిటెక్టర్లు) పనిచేసే స్థితిలో లేవు. మంటలనార్పే సాధనాలు (ఫైర్ ఎక్స్టింగిషర్లు) పని చేసే గడువు 2011 ఫిబ్రవరిలోనే ముగిసింది. వీటిని 2012 నవంబరునాటికి తిరిగి భర్తీ చేయలేదు.
- బీ, సీ, ఎల్ బ్లాకుల్లో మంటలనార్పే పరికరాలు, హైడ్రేంట్ సిస్టమ్‌లు లేవు. ఈ బ్లాకుల్లోని కారిడార్లలో అల్మారాలు అడ్డుగా ఉండి అగ్నిప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితులు సంభవించినపుడు ప్రజా భద్రతకు ప్రమాదకరంగా ఉన్నాయి.



*ఆంధ్రప్రదేశ్ సచివాలయం, డీ బ్లాకులో అగ్ని ప్రమాద దృశ్యం*

బహుళ అంతస్తుల భవనాల తనిఖీ సంఘం[25] సచివాలయంలోని ప్రతీబ్లాకులోనూ అగ్ని ప్రమాదాల నిరోధానికి ముందు జాగ్రత్త కోసం ఏర్పాట్లకు సంబంధించి కొన్ని సిఫార్సులు చేసిందనీ, అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణలకు, ప్రాణ రక్షణకు భరోసా కోసం సంబంధితులకు ఆదేశాలు జారీ చేసామని డీజీ ఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

***రవీంద్ర భారతి :*** ఇది సాంస్కృతిక కార్యక్రమాలకోసం రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్మించిన జాతీయ స్థాయి కళాకేంద్రం. ఇది ఎత్తైన భవనం క్యాటగిరిలోనిది కాదు. ఇందులో 1100 సీట్లున్న ఒక ప్రధాన థియేటరు, 120 సీట్లు ఉన్న ఒక చిన్న థియేటరు, 200 మందికి సరిపడా ఒక సమావేశ మందిరం ఉన్నాయి. ఆడిట్‌లో ఈ కింది అంశాలను గమనించడమైంది :

- ఈ భవనానికి అగ్నిమాపక సేవల శాఖనుండి ఎన్‌ఓసీని పొందలేదు
- 2012 జూన్ నాటికి హైడ్రేంట్ సిస్టమ్, స్మోక్ డిటెక్టర్లు, అలారమ్ సిస్టమ్‌లు లేవు.
- ప్రధాన థియేటరులో మాత్రమే ఫైర్ ఎక్స్టింగిషర్లు ఉన్నాయి. చిన్న థియేటరులో, సమావేశ మందిరంలో అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణ పరికరాలు లేవు.
- రెండవ, మూడవ అంతస్తుల్లో అగ్నిప్రమాదం జరిగినపుడు బయటపడటానికి సరైన నిష్క్రమణ మార్గాలు లేవు.

జీ హెచ్ఎమ్‌సీ పరిధిలో ఉన్న ఎత్తైన భవనాల క్యాటగిరీ కిందకురాని భవనాలన్నింటిలోనూ అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణకు, ప్రాణ రక్షణకు భరోసా కోసం తక్షణ చర్యలు చేపట్టాల్సిందిగా జీహెచ్ఎమ్‌సీ కమీషనరును కోరామని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

***ఆంధ్రప్రదేశ్ శాసనసభవద్దనున్న జూబ్లీహాల్ :*** ఇది ఒక రాజ భవనం. దీనిని హైదరాబాద్ వాస్తుకళా నైపుణ్యానికి ఒక మచ్చుతునకగా పరిగణిస్తారు.

ఆడిట్‌లో ఈ కింది అంశాలను గమనించడమైంది :

- ఈ భవనానికి అగ్నిమాపక సేవల శాఖనుండి ఎన్‌ఓసీని పొందలేదు
- నీటిని నిల్వ ఉంచే ట్యాంకు పాడయినందువల్ల అత్యవసర పరిస్థితుల్లో దరిదాపుల్లో నీటి సౌకర్యం అందుబాటులో ఉండదు.
- ఫైర్ ఎక్స్టింగిషర్లు, హైడ్రేంట్ సిస్టమ్‌లు లేవు




*జూబ్లీహాల్‌లో అగ్నిప్రమాద దృశ్యం*
*(అంతర్ చిత్రంలో: తగలబడిపోయిన ఏసీ ప్లాంటు)*

2012 జూలై 1న కీలక వ్యక్తులు హాజరైన ఒక సమావేశం ముగిసిన 15 నిముషాల తర్వాత జూబ్లీహాల్‌లో అగ్నిప్రమాదం జరిగిన విషయాన్ని ఇక్కడ ప్రస్తావించడం సందర్భోచితం.

బహుళ అంతస్తుల భవనాల తనిఖీ సంఘం 2012 జూలైలో జూబ్లీహాల్‌ను తనిఖీచేసి, ఎన్‌బీసీ-2005లో నిర్దేశించిన ప్రకారం అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణకు, చేయాల్సిన ఏర్పాట్లపై కొన్ని సిఫార్సులు చేసిందనీ, ఈ ఏర్పాట్లు అమలయ్యేలా చూడమని రాష్ట్ర శాసనసభా కార్యదర్శిని కోరామనీ డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

[25] ఆంధ్రప్రదేశ్ సచివాలయం ప్రాంగణంలో అగ్నిప్రమాదాల నివారణ, నియంత్రణ ఏర్పాట్ల తనిఖీ కోసం ఏర్పాటైంది

*గగన్ విహార్* : ఇది హైదరాబాద్‌లో రెండు వేలమంది ఉద్యోగులున్న ప్రభుత్వ కార్యాలయాలకు వసతి కల్పిస్తున్న 14 అంతస్తుల భవనం. ఈ కింది అంశాలను ఆడిట్‌లో గమనించడమైంది :

- అగ్నిమాపక సేవల శాఖనుండి ఎన్ఓసీని పొందలేదు.
- హైడ్రేంట్ సిస్టమ్, నీటిసంపు, మోటార్‌లు గత ఇరవై ఏళ్ళనుండి పనిచేయడంలేదు.
- అగ్నిమాపక సాధనాలు పనిచేసే గడువు తేదీ దాటిపోయింది; వాటిని రీఫిల్ చేయలేదు.




*గగన్ విహార్‌లో పనిచేయని డ్రై హైడ్రెంట్ సిస్టమ్ (2012 జూలై 12)*

బహుళ అంతస్తుల భవనమైన గగన్ విహార్‌ను అగ్నిమాపక సేవల శాఖ 2012 సెప్టెంబరులో తనిఖీ చేసిందనీ అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలు, నియంత్రణ ఏర్పాట్ల అమలుకోసం ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ మండలిని కోరామనీ డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### ఆసుపత్రులు

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న ఏడు జిల్లాల్లో తొమ్మిది ఆసుపత్రులను[26] తనిఖీ చేయగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- ఐదు ఆసుపత్రుల్లో, భవనానికి మూడు వైపులా అగ్నిమాపక వాహనం నిరాటంకంగా వెళ్ళే వీలులేదు
- ఆరు ఆసుపత్రుల్లో, అగ్నిమాపక సాధనాలు లేవు
- రంగారెడ్డి జిల్లాలో ఐదు ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాలను నియంత్రించడానికి నీటి సదుపాయం లేదు
- ఏడు ఆసుపత్రుల్లో అగ్ని ప్రమాదాల హెచ్చరిక వ్యవస్థ, హైడ్రేంట్, స్ప్రింకర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ వంటి అధునాతన పరికరాలు లేవు.
- సికింద్రాబాద్ యశోదా హాస్పిటల్‌లో అత్యవసర మార్గం మూసేసి, తాళం వేసి ఉంది.
- హైదరాబాద్‌లోని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో, అగ్నిమాపక సాధనాలు పనిచేసే గడువు 2011 ఏప్రిల్‌లో ముగియగా, వాటిని ఇంకా రీఫిల్ చేయలేదు.
- సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో, అత్యవసర పరిస్థితుల్లో రోగులను బయటకు పంపేందుకు అనువుగా ఉండే ర్యాంపును నిర్మించలేదు
- ఇమేజ్ హాస్పిటల్స్‌లో, అగ్నిమాపక సాధనాలు తగినన్ని లేవు; మెట్ల మార్గం చాలా ఇరుకుగా ఉంది.

అగ్నిమాపక సేవల శాఖ, జీ హెచ్ఎమ్‌సీ 296 ఆసుపత్రుల్లో లోపాలున్నట్లు కనుగొన్నామనీ, 60 రోజుల్లోగా ఈ లోపాలను సరిదిద్దాలని వాటి యాజమాన్యాలకు నోటీసులు జారీ చేయమని, ఆసుపత్రులకు లైసెన్సులు జారీ/ నవీకరణ చేసేముందు అగ్నిమాపక సేవల శాఖ అనుమతులు తప్పనిసరి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారులను కోరామనీ డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు).

---

[26] చిత్తూరు జిల్లా : ఎలైట్ హాస్పిటల్ (తిరుపతి), రవి న్యూరో హాస్పిటల్ (తిరుపతి); హైదరాబాద్ జిల్లా : నిమ్స్, కిమ్స్, ఇమేజ్ హాస్పటల్స్ (హైదరాబాద్), యశోదా హాస్పిటల్ (సికింద్రాబాద్); కృష్ణా జిల్లా : నాగార్జున హాస్పిటల్ (విజయవాడ); రంగారెడ్డి జిల్లా : బాలాజీహాస్పిటల్ (కొంపల్లి), ఎస్‌హెచ్‌కే హాస్పిటల్ (ఉప్పల్)

### విద్యా సంస్థలు

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లాల్లో ఏడు విద్యా సంస్థలను[27] పరిశీలించగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- ఆరు విద్యా సంస్థల్లో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పరికరాలు లేవు
- హైదరాబాద్ షాదన్ కాలేజి భవనానికి ఒక బ్లాకులో 10 అంతస్తులు, రెండవ బ్లాకులో 11 అంతస్తులు ఉన్నాయి. ఇందులో నిర్వహిస్తున్న ఫార్మసీ, ఇంజినీరింగ్, జూనియర్ కాలేజీల్లో సుమారు 5,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ భవనానికి మూడువైపులా అగ్నిమాపక వాహనం తిరిగే వీలులేదు. 11 అంతస్తులున్న జూనియర్ కాలేజి భవనంలో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పరికరాలను ఏర్పాటు చేయలేదు. మెట్లమార్గం కూడా చిన్నగా ఉంది.
- వైఎస్ఆర్ జిల్లా, రాజంపేటలోని అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్‌లో ఏడు ప్రయోగశాలలున్నాయి. కానీ, అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పరికరాలను ఎన్ బీ సీ ప్రమాణాల మేరకు ఏర్పాటు చేయలేదు.
- హైదరాబాద్‌లోని సిటీ కాలేజి మూడంతస్తుల భవనం, ఇందులో సుమారు 3,000 విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిపాలనా సిబ్బంది ఉన్నారు. దీని గ్రంథాలయంలో విలువైన పుస్తకాలున్నాయి. కానీ, మొత్తం భవనానికి 10 పోర్టబుల్ ఫైర్ ఎక్స్టింగిషర్లు మాత్రమే ఏర్పాటు చేసారు. హైడ్రేంట్ సిస్టమ్, ఫైర్ అలారమ్‌లు, స్మోక్ డిటెక్టర్లు లేవు.

పై అంతస్తుల్లో ఏర్పాటు చేసిన 3,544 విద్యా సంస్థల్లో లోపాలున్నట్లు అగ్నిమాపక సేవల శాఖ కనుగొందనీ, అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణలకు, ప్రాణ రక్షణకు సంబంధించిన ఏర్పాట్ల గురించి ఈ సంస్థలకు నోటీసులు జారీ చేయాల్సిందిగా కళాశాలలకు సంబంధించి ఉన్నతవిద్యా శాఖ ముఖ్య కార్యదర్శిని, పాఠశాలలకు సంబంధించి పాఠశాల విద్యా శాఖ కమీషనరు మరియు సంచాలకులను కోరామనీ డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు). ఈ సంస్థలకు అనుమతులు జారీ చేయడానికి/నవీకరించడానికి ముందు అగ్నిమాపక సేవల అధికారులనుండి పొందాల్సిన ఎన్ఓసీని తప్పనిసరి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామనికూడా తెలిపారు.

### ఫంక్షన్ హాళ్ళు

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లాల్లో 12 ఫంక్షన్‌హాళ్ళను[28] తనిఖీ చేయగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- ఎనిమిది ఫంక్షన్‌హాళ్ళలో, భవనానికి మూడువైపులా అగ్నిమాపక వాహనం తిరిగే వీలులేదు. ఫలితంగా, అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు రక్షణ చర్యలు, మంటలనార్పే కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుంది.
- పదకొండు ఫంక్షన్‌హాళ్ళలో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే పరికరాలు లేవు.
- ఎనిమిది ఫంక్షన్‌హాళ్ళలో మెట్లమార్గం పైకీ, కిందకూ ఇబ్బందిలేకుండా తిరగడానికి సరిపడేంతగా లేదు. వైఎస్ఆర్ (కడప) జిల్లా, రాయచోటిలోని ప్రీతమ్ రెసిడెన్సీ వద్ద ఉన్న ఫంక్షన్ హాలుకు మొదటి, రెండవ అంతస్తులతో సంబంధం లేకుండా మెట్లమార్గంఉంది. కాబట్టి అగ్ని ప్రమాదాలు జరిగినా, అత్యవసర పరిస్థితులు తలెత్తినా మూడో అంతస్తునుండి తప్పించుకునే ఆస్కారంలేదు.

---

[27] శ్రీ చైతన్య స్కూల్ (చిత్తూరు), సిటీ కాలేజి (హైదరాబాద్), గీతాంజలి స్కూల్ (హైదరాబాద్), షాదన్ జూనియర్ మరియు డిగ్రీ కాలేజి (హైదరాబాద్), షాదన్ ఇంజినీరింగ్ మరియు ఫార్మసీ కాలేజి (హైదరాబాద్), అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (రాజంపేట), చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ప్రొద్దుటూరు)

[28] చిత్తూరు : (3), హైదరాబాద్ : (4), క్రిష్ణా : (1), రంగారెడ్డి : (2), వైఎస్ఆర్(కడప) : (2)

ప్రమాదకర ప్రాంగణాలన్నింటిలో అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణ, ప్రాణ రక్షణకు ఏర్పాట్లు అమలయ్యేలా చూసేందుకు అగ్నిమాపక సేవల శాఖ, కార్మిక-పరిశ్రమల శాఖల ఆధ్వర్యంలో సంయుక్త తనిఖీల నిర్వహణకు 2012 అక్టోబరులో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించామని డీజీ ఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### సినిమా థియేటర్లు

ఆడిట్‌కు ఎంపిక చేసుకున్న జిల్లాల్లో 19 సినిమా థియేటర్లను[29] పరిశీలించగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి:

- ఏడు థియేటర్లలో , థియేటరుకు మూడువైపులా అగ్నిమాపక వాహనం తిరిగే వీలులేదు
- పదకొండు థియేటర్లలో అగ్నిప్రమాదాలనెదుర్కోడానికి హైడ్రేంట్‌లు, ఫైర్ అలారమ్, స్ప్రింక్లర్లువంటి పరికరాలను ఏర్పాటు చేయలేదు
- ఆరు థియేటర్లలో అగ్నిమాపక సాధనాలు/బకెట్లు (నీరు/ఇసుక) లేవు.

హైదరాబాద్‌లోని ప్రసాద్ మల్టీప్లెక్సు థియేటర్లో హైడ్రేంట్ సిస్టమ్ వంటి అగ్నిప్రమాదాలనెదుర్కొనే పరికరాలు ఉన్నప్పటికీ, హోజు పైపు ఉంచే బాక్సులో హోజు పైపు/నాజిల్‌లు లేవు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్ళాల్సిన మార్గాలు మూసి, తాళాలు వేసారు. ఇవి అత్యవసర పరిస్థితులు తలెత్తినపుడు వెంటనే వినియోగించుకొనేట్లు లేవు.

రాష్ట్రంలో 2,158 సినిమా థియేటర్లలో లోపాలున్నట్లు అగ్నిమాపక సేవల శాఖ కనుగొందనీ, వీటిని ప్రమాదకరమైనవిగా పరిగణించడమైందనీ డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 నవంబరు). ప్రస్తుతం ఉన్న థియేటర్లలో అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణ, ప్రాణ రక్షణ ఏర్పాట్ల విషయమై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావలసి ఉందని, లైసెన్సులను నవీకరించేముందు సినిమా థియేటర్లలో అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణల ఏర్పాట్లు ఉన్నాయని నిర్ధారించుకోవాలని, అగ్నిమాపక సేవల శాఖ అధికారుల నుండి నిరభ్యంతర పత్రాన్ని పొందడం తప్పనిసరి చేయాలని వీటికి లైసెన్సులను జారీ చేసే అధికారాలున్న పోలీసు కమీషనర్లు/జాయింట్ కలెక్టర్లను కోరామనికూడా డీజీఎఫ్ఎస్ తెలిపారు.

## 2.5.3 అగ్నిమాపక అవుట్ పోస్టులు

అత్యవసర పరిస్థితుల్లో అగ్నిప్రమాదాల నెదుర్కొనడానికి కాంట్రాక్టు/అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన 19 అవుట్ పోస్టులు[30] పనిచేస్తున్నాయి. ఇందులో ఐదు అవుట్ పోస్టులు మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో[31] ఉన్నాయి. విశాఖపట్నం జిల్లాలోని రెండు అవుట్ పోస్టులు సక్రమంగా పనిచేస్తున్నాయి. కృష్ణాజిల్లాలోని అవుట్ పోస్టుకు సంబంధించిన రికార్డులను ఆడిట్‌కు సమర్పించలేదు. మహబూబ్‌నగర్ జిల్లాలోని రెండు ఫైర్ అవుట్‌పోస్టుల పనితీరును పరిశీలించగా ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు గృహ నిర్మాణ సంస్థ[32] వద్ద 2005 మార్చి-సెప్టెంబరులోనే నిధులను జమచేసినప్పటికీ, మూడు ఫైర్ అవుట్‌పోస్టులు[33] పూర్తికావడానికి[34] నాలుగునుండి ఐదేళ్ళ వరకూ జాప్యం జరిగింది.

---

[29] చిత్తూరు : (9), హైదరాబాద్ : (4), మహబూబ్‌నగర్ : (1), రంగారెడ్డి : (3), వైఎస్ఆర్(కడప) : (2)

[30] గుంటూరు : (1), కరీంనగర్ : (3), ఖమ్మం : (1), కృష్ణా : (1), మహబూబ్‌నగర్ : (2), మెదక్ : (3), నల్గొండ : (1), నిజామాబాద్ : (2), శ్రీకాకుళం : (2), విశాఖపట్నం : (2), వరంగల్ : (1)

[31] మహబూబ్‌నగర్ : (2), కృష్ణా : (1), విశాఖపట్నం : (2)

[32] ఏపీఎస్‌పీహెచ్‌సీ

[33] కల్వకుర్తి, అమ్రాబాద్, షాద్‌నగర్

[34] కల్వకుర్తి : 2008 జూన్, అమ్రాబాద్ : 2009 ఏప్రిల్, షంషాబాద్ : 2009 జూన్

- ఒప్పందపు షరతుల్లో నిర్దేశించిన ప్రకారం, ఒప్పందం కుదుర్చుకున్న తేదీ (2009 జనవరి) నుండి 100 రోజులలోపు (2009 మే) సర్వీసు ప్రొవైడరు కార్యకలాపాలను ప్రారంభించాలి. ఐతే, సర్వీసు ప్రొవైడరు సకాలంలో సేవలు మొదలుపెట్టేలా డీఎఫ్ఓ/ఆర్ఎఫ్ఓ చర్యలు తీసుకోలేదు. సెక్యూరిటీ డిపాజిటు ₹1 లక్షను ప్రభుత్వ ఖాతాకు జమ చేయనూ లేదు. షాద్‌నగర్ ఫైర్ అవుట్‌పోస్టు సేవలు ఒక ఏడాదిపై ఏడు నెలల జాప్యంతో 2010 ఫిబ్రవరిలో, అమ్రాబాద్ ఫైర్ అవుట్‌పోస్టు సేవలు రెండేళ్ళ జాప్యంతో 2010 అగస్టులో ప్రారంభమయ్యాయి. కల్వకుర్తి ఫైర్ అవుట్‌పోస్టు సేవలు 2012 జూన్ నాటికి ఇంకా మొదలుకాలేదు.

- షాద్‌నగర్, అమ్రాబాద్‌ల వద్ద ఫైర్ అవుట్‌పోస్టులు శిక్షణ పొందని సిబ్బందితో పనిచేస్తున్నాయి. రెండు ఫైర్ అవుట్‌పోస్టుల్లో ఉన్న 32 మంది అగ్నిమాపక సేవల సిబ్బందిలో 18 మంది మాత్రమే శిక్షణ పొందారు. ఒప్పందం ప్రకారం, అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనే విధుల్లో 6 నెలలు శిక్షణ ఇవ్వడానికి ప్రతి ఫైర్ అవుట్ పోస్టుకు ఒక లీడింగ్ ఫైర్‌మ్యాన్‌ను పంపలేదు.

- షాద్‌నగర్, అమ్రాబాద్ ఫైర్ అవుట్‌పోస్టులు తాము ఎన్ని ఫైర్ కాల్స్/రెస్క్యూ కాల్స్‌కు హాజరయ్యామనే వివరాలను, ఇతర వివరాలను డీజీఎఫ్ఎస్‌కు సమర్పించిన నెలవారీ నివేదికలో పేర్కొనలేదు.


ఫైర్ అవుట్‌పోస్టులు ప్రభావవంతంగా పనిచేసేలా చూసేందుకు వీటిని సమగ్రంగా సమీక్షిస్తామని డీజీ ఎఫ్ఎస్ హామీనిచ్చారు (2012 నవంబరు).

## 2.6 మానవ వనరుల నిర్వహణ

### 2.6.1 సిబ్బంది కొరత

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి - 2006 లోని 5వ నియమం ప్రకారం, ఒక సింగిల్ యూనిట్‌తో ఉన్న ఫైర్ స్టేషన్‌లో కనీసం ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ (ఎస్ఎఫ్ఓ), ఇద్దరు లీడింగ్ ఫైర్‌మ్యాన్‌లు (ఎల్ఎఫ్ఎమ్), ముగ్గురు డ్రైవర్ ఆపరేటర్లు (డీఓ), పదిమంది ఫైర్‌మ్యాన్‌లు (ఎఫ్ఎమ్) ఉండాలి. అదే విధంగా, డబుల్ యూనిట్లు ఉన్న ఫైర్ స్టేషన్‌లో ఒక ఎస్ఎఫ్ఓ, నలుగురు ఎల్ఎఫ్ఎమ్‌లు, ఐదుగురు డీఓలు, ఇరవైమంది ఎఫ్ఎమ్‌లు ఉండాలి. ఇక బహుళ యూనిట్ల స్టేషన్లలో ఒక ఎస్ఎఫ్ఓ, ఆరుగురు ఎల్ఎఫ్ఎమ్‌లు, పదిమంది డీఓలు, ఇరవైమంది ఎఫ్ఎమ్‌లు ఉండాలి. రాష్ట్రంలో 220 సింగిల్ యూనిట్‌లు, 31 డబుల్ యూనిట్లు, 2 బహుళ యూనిట్‌లు ఉన్న ఫైర్ స్టేషన్లు ఉన్నాయి.

**చార్టు-2.1**
**అవసరమైన సిబ్బంది - వాస్తవంగా ఉన్న సిబ్బంది**




*మూలం : డీజీఎఫ్ఎస్ రికార్డులు*

చార్టు-2.1లో చూపిన వివరాల ప్రకారం కీలకమైన పోస్టుల్లో ఖాళీలు ఉండటం వల్ల అగ్నిమాపక సేవల శాఖ ఇబ్బందుల నెదుర్కొంటోంది. ఫైర్ మ్యాన్ పోస్టుల్లో 20 శాతం డ్రైవర్ ఆపరేటర్ పోస్టుల్లో 15 శాతం ఖాళీలు ఉన్నాయి. దీనివల్ల ఈ శాఖ కార్య సామర్థ్యంపై దుష్ప్రభావం పడింది. విజయనగరం డీఎఫ్ఓ పోస్టు 2011 మే నుండి, నల్గొండ డీఎఫ్ఓ పోస్టు 2012 జూన్ నుండి ఖాళీగా ఉన్నాయి.

లీడింగ్ ఫైర్‌మ్యాన్ క్యాడరులో 5 శాతం ఖాళీలు, ఫైర్‌మ్యాన్ క్యాడరులో 20 శాతం ఖాళీలు ఉన్నాయి.

ఆడిట్ పరిశీలనలను డీజీఎఫ్ఎస్ అంగీకరించారు (2012 నవంబరు).

## 2.6.2 అగ్నిమాపక వాహనాలపై విధులకు హాజరయ్యే సిబ్బంది సంఖ్య

ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక సేవల మాన్యువల్‌లోని పేరా 536(1) ప్రకారం, అగ్నిమాపక వాహనంపై విధులకు హాజరయ్యే సిబ్బందిలో ఒక లీడింగ్ ఫైర్‌మ్యాన్, ఒక డ్రైవర్ ఆపరేటర్, ముగ్గురు ఫైర్‌మ్యాన్‌లు, ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ తప్పనిసరిగా ఉండాలి.

మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని, 293 భారీ/అతి భారీ అగ్ని ప్రమాదాలకు సంబంధించిన నివేదికలను పరిశీలించగా, మంటలను ఆర్పడానికి అవసరమైన పూర్తి స్థాయి సిబ్బంది లేకుండానే అగ్నిమాపక సేవలను నిర్వహించినట్లు వెల్లడైంది. మంటలనార్పే విధుల నిర్వహణకు ముగ్గురు ఫైర్‌మ్యాన్‌లు అవసరంకాగా మచ్చుకు తనిఖీ చేసిన 293 కేసులకుగానూ 70 కేసులలో ఒకే ఒక్క ఫైర్‌మ్యాన్, 133 కేసులలో ఇద్దరు ఫైర్‌మ్యాన్‌లు మాత్రమే విధుల నిర్వహణలో పాల్గొన్నారు. మరో నాలుగు కేసులలో ఒక్క ఫైర్‌మ్యాన్ కూడా బృందంలో లేనందువల్ల మంటలనార్పే విధులను డ్రైవర్ ఆపరేటర్, లీడింగ్ ఫైర్‌మ్యాన్‌లు మాత్రమే నిర్వహించాల్సివచ్చింది.

ఆడిట్ పరిశీలనలను డీజీఎఫ్ఎస్ అంగీకరించారు (2012 నవంబరు).

## 2.6.3 అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ

### *2.6.3.1 కార్యాచరణ ప్రణాళికలు లేకపోవడం*

డీఎఫ్ఓ, ఎస్ఎఫ్ఓ, ఎఫ్ఎమ్, డీఓల క్యాడర్లలో సర్వీసులో ఉన్న సిబ్బందికి, నేరుగా నియుక్తులైన కొత్త సిబ్బందికి డీజీఎఫ్ఎస్ ఆమోదించిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక ప్రకారం రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థ (ఎస్‌టీఎస్) శిక్షణను ఇస్తుంది. కిందిస్థాయి అగ్నిమాపక సిబ్బంది ఎలాంటి సంఘటనలైనా ఎదుర్కోడానికి, నిత్యం సన్నద్ధతతో ఉండటానికి వారికి నిరంతరం శిక్షణను ఇవ్వాలని ఎస్ఎఫ్ఏసీ సిఫార్సుల్లో నిర్దేశించడమైంది.

2007-12 మధ్యకాలానికి శిక్షణను ఇవ్వడానికి ఎస్‌టీఎస్ ఎలాంటి కార్యాచరణ ప్రణాళికనూ రూపొందించలేదు. 2007-12 మధ్యకాలంలో (2012 డిసెంబరు వరకు) శిక్షణ పొందిన సిబ్బంది వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**పట్టిక 2.8**

| సంవత్సరం | కోర్సుల సంఖ్య | డీఎఫ్ఓ | | ఎస్ఎఫ్ఓ | | ఎల్ఎఫ్ఎమ్ | | డీఓ | | ఎఫ్ఎమ్ | | మొత్తం | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | D | O | D | O | D | O | D | O | D | O | D | O |
| 2007-08 | 11 | 0 | - | 56 | 8 | 106 | - | 135 | 5 | 121 | 61 | 418 | 74 |
| 2008-09 | 11 | 0 | - | 18 | - | 0 | - | 256 | 5 | 77 | 109 | 351 | 114 |
| 2009-10 | 9 | 0 | - | 0 | - | 0 | - | - | 140 | 212 | 101 | 212 | 241 |
| 2010-11 | 8 | 9 | - | 235 | - | 0 | - | - | - | 74 | 7 | 318 | 7 |
| 2011-12 | 5 | 0 | - | 145 | - | 0 | - | 13 | - | 349 | 9 | 507 | 9 |
| మొత్తం | 44 | 9 | - | 454 | 8 | 106 | - | 404 | 150 | 833 | 287 | 1806 | 445 |

*D : అగ్నిమాపక సిబ్బంది; O : ఇతర సంస్థల సిబ్బంది*
*మూలం : రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థ రికార్డులు*

రాష్ట్రంలో 2007-12 మధ్య కాలంలో, మొత్తంమీద 9 డీఎఫ్ఓలు (15 మందికి), 454 మంది ఎస్ఎఫ్ఓలు, 106 మంది ఎల్ఎఫ్ఎమ్‌లు (548 మందికి), 404 మంది డీఓలు (714 మందికి), 833 మంది ఎఫ్ఎమ్‌లు (2,312 మందికి) 44 కోర్సులలో శిక్షణ పొందారు.

నేరుగా నియుక్తులైన కొత్త సిబ్బందికి, సర్వీసులో ఉన్న వారికి శిక్షణను ఇవ్వడానికి సంబంధించిన వార్షిక ప్రణాళిక గురించి డీజీఎఫ్ఎస్ నిర్దిష్ట సమాధానం ఇవ్వలేదు.

#### 2.6.3.2 హోమ్ గార్డులకు అగ్నిమాపక శిక్షణను కల్పించకపోవడం

ఫైర్ కాల్‌కు స్పందించి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా అగ్నిమాపక సేవల విధులను నిర్వహించడానికి ఫైర్ స్టేషన్ సిబ్బందికి తగిన శిక్షణను ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, అత్యవసర సేవలు, ఫీజుల విధింపు నియమావళి - 2006 లోని 33వ నియమములో నిర్దేశించడం జరిగింది. ఆడిట్ పరిశీలనలో ఈ కింది అంశాలు వెల్లడయ్యాయి :

- 2007-12 మధ్య కాలంలో, హోమ్ శాఖనుండి 811 మంది హోమ్ గార్డులను డిప్యుటేషన్‌పై తీసుకుని ఫైర్‌మెన్, డ్రైవర్ ఆపరేటర్ పోస్టుల్లోని ఖాళీల్లో నియమించారు. కానీ ఇందులో ఏ ఒక్కరికీ అగ్ని ప్రమాదాలను ఎదుర్కోవడంలో ఎస్‌టీఎస్ శిక్షణ ఇవ్వలేదు. కేటాయించిన ఫైర్‌స్టేషన్లలో విధుల్లో చేరిన సమయంలో హోమ్ గార్డులకు ప్రాక్టికల్ శిక్షణను ఇవ్వడం జరిగిందని డీజీఎఫ్ఎస్ తెలిపారు (2012 మార్చి). అగ్నిప్రమాదాలను ఎదుర్కొనడానికి సంబంధించి హోమ్ గార్డులకు ఎలాంటి శిక్షణా ఇవ్వలేదని మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో డీఎఫ్ఓలు నిర్ధారించారు.
- రంగారెడ్డి జిల్లా, గచ్చిబౌలిలోని మోడల్ ఫైర్ స్టేషన్‌లో 2010-11 లో ఫైర్ మెన్ పోస్టుల్లో 77 మందిని, డ్రైవర్ ఆపరేటర్ పోస్టులో 20 మందిని చొప్పున మొత్తం 97 మంది హోమ్ గార్డులను నియమించారు. వీరికి కూడా అగ్నిప్రమాదాలను ఎదుర్కొనే విషయమై శిక్షణ కల్పించలేదు.

హోమ్ గార్డులకు నిర్దిష్టమైన శిక్షణ ఇవ్వలేదని డీజీఎఫ్ఎస్ అంగీకరించారు (నవంబరు 2012).

### 2.6.4 వాణిజ్య సముదాయం, ఈతకొలనులను వినియోగించకుండా వృధాగా వదిలేయడం

రాష్ట్రస్థాయి శిక్షణ సంస్థ వద్ద 2009 జూన్‌లో ₹1.19 కోట్ల ఖర్చుతో ఒక వాణిజ్య సముదాయాన్ని, ఒక ఈత కొలనును నిర్మించారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అద్దెకు ఇవ్వడం ద్వారా వీటిని శిక్షణ పొందుతున్న వారి సౌకర్యానికి వినియోగించాలని తలచారు. కానీ 2012 జూన్ నాటికి వాణిజ్య సముదాయాన్ని కానీ, ఈత కొలనును కానీ వినియోగించలేదనీ, ఫలితంగా వీటిని నిర్మించిన లక్ష్యం నెరవేరలేదనీ ఆడిట్ పరిశీలనలో గమనించడమైంది.

## 2.7 అంతర్గత నియంత్రణలు , పర్యవేక్షణ

### 2.7.1 వ్యయ నియంత్రణ యంత్రాంగం లేకపోవడం

అప్రోప్రియేషన్ తాలూకు ప్రతి యూనిట్ కిందా చేసే ఖర్చు ఆ అప్రోప్రియేషన్ కేటాయింపునకు మించకుండానూ, ఖర్చులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండేలా సీసీఓ చూడాలని ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్‌లో నిర్దేశించడం జరిగింది.

ఐతే, సీసీఓ వద్ద వ్యయ నియంత్రణ రిజిస్టరును నిర్వహించడంలేదు. డీఎఫ్ఓలనుండి నెలవారీ ఖర్చుల వివరాలు సకాలంలో అందుతున్నాయో లేదో గమనించేందుకు ఎలాంటి యంత్రాంగమూ లేదు.

### 2.7.2 రాబడులు, ఖర్చులను రికన్సీలియేషన్ చేయకపోవడం

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ మాన్యువల్‌లోని నిబంధనల ప్రకారం, ప్రతీ ప్రభుత్వశాఖకు సంబంధించి నెలవారీ రాబడులు, ఖర్చుల లెక్కలను సంబంధిత డీడీఓలు ట్రెజరీల్లో నమోదైన అంకెలతోనూ, సీసీఓలు ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (పీఏజీ) (ఏ&ఈ) కార్యాలయంలో నమోదైన అంకెలతోనూ సరిపోల్చి చూసుకోవాలి.

వాపసు చేయడానికి వీలులేని ఫైర్ ప్రికాషన్ ఫీజు, లైసెన్సుల జారీ/నవీకరణ ఫీజు, యూజర్ చార్జీలు మొదలైన రాబడులు అగ్నిమాపక సేవల శాఖకు వస్తాయి. 2007-12 మధ్య కాలంలో ఈ విధంగా ₹53.83 కోట్ల రాబడులు వచ్చాయి. ఐతే, మచ్చుకు తనిఖీ చేసిన డీడీఓలలో ఏ ఒక్కరూ తమ రికార్డుల్లోని రాబడుల అంకెలను ట్రెజరీల్లో

నమోదైన అంకెలతో సరిపోల్చి చూడలేదు. సంబంధిత వ్యక్తులు రుసుములను నేరుగా ట్రెజరీలో జమచేస్తారు కాబట్టి, ఈ మొత్తాలను ఎప్పటికప్పుడు రికన్సీలియేషన్ చేయకపోతే రెవెన్యూ లీకేజీలు జరిగే అవకాశాలను తోసిపుచ్చలేము.

అదే విధంగా, 2007-12 మధ్య కాలంలో డీడీఓల ఖర్చులను సీసీఓ కన్సాలిడేట్ చేయనూలేదు, (పీఏజీ) (ఏ&ఈ)కార్యాలయంలో నమోదైన ఖర్చులతో తమ రికార్డుల్లోని అంకెలను సరిపోల్చి చూసుకోనూలేదు. 2007-12 మధ్య కాలంలోని ప్రతి సంవత్సరంలోనూ డీజీ ఎఫ్ఎస్ నివేదించిన ఖర్చులకూ, పీఏజీ (ఏ&ఈ) కార్యాలయంలో నమోదైన అంకెలకూ మధ్య వ్యత్యాసం ఉంది. ఈ వ్యత్యాసం ఒక కోటి రూపాయల నుండి 14 కోట్ల రూపాయల వరకూ ఉంది.

రాబడుల మొత్తాలను ఎప్పటికప్పుడు రికన్సీలియేషన్ చేయాలని డీడీఓలకు ఆదేశాలు జారీ చేసామని డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### 2.7.3 శాఖాపరమైన తనిఖీలు

అగ్నిమాపక సేవల శాఖ పనితీరును మదింపు చేయడంలోనూ, ఏవైనా లోపాలుంటే గుర్తించడానికి, దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి, సిబ్బంది ఫిర్యాదులను పరిష్కరించడానికి, అగ్నిప్రమాదాలను ఎదుర్కొనడంలో సంసిద్ధతను మెరుగుపర్చడానికి నిర్ణీత కాలవ్యవధిలో శాఖాపరమైన తనిఖీలు నిర్వహించడం చాలా ముఖ్యం.

ప్రభుత్వ ఆదేశాల[35] ప్రకారం, జిల్లా కార్యాలయాలను, కింది కార్యాలయాలను నిర్ణీత కాలవ్యవధుల్లో సంబంధిత శాఖాధిపతి తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలి. అంతేగాక, ఆర్ఎఫ్ఓలు రెండేళ్లకొకసారి ప్రతి ఫైర్ స్టేషన్‌ను నిర్ణీత వ్యవధిలో తనిఖీ చేసి రాష్ట్రంలోని ఫైర్ స్టేషన్లన్నింటి తనిఖీ నిర్దిష్ట కాలంలోపున పూర్తయ్యేలా చూడాలని డీజీఎఫ్ఎస్ ఆదేశాలు జారీ చేసారు (2003 మార్చి). మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో 2007-12 మధ్య కాలంలో శాఖాపరమైన తనిఖీలుగానీ ఆర్ఎఫ్ఓ తనిఖీలుగానీ జరగలేదని ఆడిట్ పరిశీలనలో గమనించడమైంది.

ప్రాంతీయ/జిల్లా అగ్నిమాపక సేవల అధికారులకు వారి పరిధిలోని ఫైర్ స్టేషన్లను తనిఖీ చేయాలని 2012 ఆగస్టులో ఆదేశాలిచ్చామని డీజీఎఫ్ఎస్ సమాధానమిచ్చారు (2012 నవంబరు).

### 2.7.4 అంతర్గత తనిఖీ

శాఖాపరమైన నియమాలు, విధానాలను ఏమేరకు పాటిస్తున్నారనే విషయాన్ని అంతర్గత తనిఖీలో పరిశీలించి మదింపు చేయడం జరుగుతుంది. అంతేగాక, అంతర్గత నియంత్రణలు తగినన్ని ఉన్నాయా, అవి పని చేస్తున్నాయా అనే విషయంలో యాజమాన్యానికి తగిన భరోసాను ఇస్తాయి. ప్రభుత్వ ఉత్తర్వుల[36] ప్రకారం, ఏదైనా ప్రభుత్వ శాఖలోని అకౌంట్ల విభాగం అధిపతి ప్రాంతీయ కార్యాలయాలు, జిల్లా కార్యాలయాలు, యూనిట్ కార్యాలయాలు మొదలైన వాటికి కనీసం ఏడాదికి ఒకసారయినా అంతర్గత తనిఖీ నిర్వహించి నివేదికను సమర్పించాలి.

విశాఖపట్నం జిల్లాలో తప్ప, మచ్చుకు తనిఖీ చేసిన మిగతా జిల్లాల్లో 2007-12 మధ్య కాలంలో జిల్లా కార్యాలయాల (డీఎఫ్ఓల) అంతర్గత తనిఖీ నిర్వహించలేదని ఆడిట్ పరిశీలనలో వెల్లడైంది.

జిల్లా కార్యాలయాల అంతర్గత తనిఖీ నిర్వహణకు చర్యలు తీసుకుంటామని డీజీఎఫ్ఎస్ హామీనిచ్చారు (2012 నవంబరు).

---

35 సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) జారీ చేసిన 1962 ఫిబ్రవరి 8వ తేదీ నాటి జీఓఎమ్ఎస్ నెం.247, 1997 జూలై 26వ తేదీ నాటి మెమో సర్క్యులర్ నెం.42050/ఏఆర్.111/97-7

36 ఆర్థిక మరియు ప్రణాళిక శాఖ జారీ చేసిన 1989 జనవరి 23వ తేదీ నాటి జీఓఎమ్ఎస్ నెం.34, 1997 జులై 1 వ తేదీ నాటి జీ ఓఆర్టీ నెం.1416

## 2.8 సారాంశం

పై పేరాలలో పేర్కొన్న విధంగా, మౌలిక వసతులకు సంబంధించి ఎస్ఎఫ్ఏసీ నిర్దేశించిన ప్రమాణాలను విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ పాటించలేదు. రాష్ట్రంలో అగ్ని ప్రమాదాల విషయంలో తలెత్తే అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనడానికి ఈ శాఖ వద్ద సరైన ఏర్పాట్లు లేవు. నిర్వహణకు సంబంధించి సమగ్ర సమాచారం ఈ శాఖ వద్ద లేని కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్న ప్రాంతాల గుర్తింపు/విశ్లేషణను చేసి, భద్రతా చర్యలను చేపట్టలేకపోయింది.

కొత్త ఫైర్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని గత ఆడిట్ నివేదికలో నిర్దిష్ట సిఫార్సును చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉపసంఘం కూడా ఇదే సిఫార్సును చేసింది. అయినప్పటికీ **2007-12** మధ్య కాలంలో ఫైర్ స్టేషన్ల కొరత **95** శాతం వరకూ ఉంది. ఫైర్ స్టేషన్లలో మౌలిక వసతులు చాలినంతగా లేవు. మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో **20** శాతం ఫైర్ స్టేషన్లు శిథిలావస్థలో ఉన్నాయి. సిబ్బందికి నివాసాలను ఏర్పాటు చేయలేదు. కాలం చెల్లిన సమాచార వ్యవస్థ వలన అత్యవసర పరిస్థితులనెదుర్కొనే సన్నద్ధతపై దుష్ప్రభావం పడింది. అగ్నిమాపక వాహనాలు, రక్షణ వాహనాలు (రెస్క్యూవ్యాన్స్) వంటి వాటి విషయంలో అవసరాలకు, వాస్తవంగా అందుబాటులో ఉన్న వాటికి మధ్య భారీ అంతరం ఉంది. అత్యధిక పౌనఃపున్యం గల రేడియో సెట్ల వంటి ఇప్పటికే కొనుగోలుచేసిన పరికరాలను అగ్నిమాపక సేవలు, విపత్తుల స్పందన శాఖ వినియోగించటంలేదు.

మచ్చుకు తనిఖీ చేసిన జిల్లాల్లో (వైఎస్ఆర్ (కడప) జిల్లాలోనూ, హైదరాబాద్ జిల్లాలో కొన్ని కేసులు తప్ప) ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణ, భద్రతల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదు. మచ్చుకు తనిఖీ చేసిన ఏడు జిల్లాల్లోని ఏ ఒక్క జిల్లాలోనూ సహాయక సేవల (ఆక్జిలరీ సర్వీసుల) ఏర్పాటు జరగలేదు. అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణకు సంబంధించిన భద్రతా చర్యల నియమావళి/ప్రమాణాలను అమలు చేసేందుకు ప్రమాదాలు సంభవించడానికి ఆస్కారం ఉన్న ప్రాంగణాలను పాక్షికంగా మాత్రమే గుర్తించారు. భద్రతా ప్రమాణాలను ఉల్లంఘించిన, ముందు జాగ్రత చర్యలు తీసుకోని వారిపై చర్యలు చేపట్టలేదు. ఫైర్ మేన్, డ్రైవర్ ఆపరేటర్ వంటి కీలక పోస్టుల్లో చాలాఖాళీలు ఉండటంవల్ల అగ్ని ప్రమాదాలను సమర్ధవంతంగా ఎదుర్కొనే కార్యక్రమాలు ప్రభావితమయ్యాయి. శిక్షణ, నైపుణ్యాల పెంపునకు సంబంధించిన కార్యక్రమాలకు తగిన ప్రాధాన్యతను ఇవ్వలేదు. బడ్జెటు కేటాయింపులు ఈ శాఖ అవసరాలకు తగినట్లులేవు. అంతేకాక, భారత ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విపత్తుల ఉపశమన నిధి నుండి నిధులు విడుదల చేయకపోవడంవల్ల ఈ శాఖ ఆధునికీకరణ ప్రక్రియ కుంటుపడింది. వ్యయ నియంత్రణలు బలహీనంగా ఉన్నాయి. నిర్దిష్ట కాలవ్యవధుల్లో శాఖాపరమైన తనిఖీలు నిర్వహించలేదు. ఆడిట్ సమీక్షా కాలం **(2007-12)**లో ఒక్క విశాఖపట్నంలో తప్ప మిగిలిన జిల్లా కార్యాలయాలకు అంతర్గత తనిఖీని నిర్వహించలేదు.

## 2.9 సిఫార్సులు

- నిర్దేశిత సేవలను ప్రజలకు అందించేలా అగ్ని మాపక సేవలు, విపత్తుల స్పందన శాఖ కార్యకలాపాలు రూపొందించుకునేలా, ఆధునికీకరణ చెందేలా చూడటానికి ముందస్తు ప్రణాళికలు, వార్షిక కార్యాచరణ ప్రణాళికలను తయారు చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలి.

- అగ్ని ప్రమాదాల నివారణ, నియంత్రణలకు భద్రతా చర్యలు తీసుకోవలసిన అవసరమున్న ప్రమాదకర ప్రాంగణాల సర్వేకు ఒక వ్యూహాన్ని, ఇతర ప్రాంతాలకు సంబంధించి ఒక కార్యాచరణ ప్రణాళికను ఈ శాఖ సిద్ధం చేసుకోవాలి. అగ్ని ప్రమాదాల నివారణకు తనిఖీలను నిర్ణీత కాల వ్యవధుల్లో నిర్వహించాలి. ఉల్లంఘనలపై సత్వర చర్యలు చేపట్టాలి.

- ఫైర్ స్టేషన్ల స్థాపన, స్పందన సమయం, మౌలిక వసతులు, పరికరాలు, మొదలైనవాటి విషయంలో ఎస్ఎఫ్ఏసీ నిర్దేశించిన ప్రమాణాలు, చేసిన సిఫార్సులను ఖచ్చితంగా పాటించాలి.

- కీలక పోస్టులన్నింటిలోనూ ఖళీలు భర్తీ చేయాలి. అగ్ని మాపక సేవల సిబ్బందికి నిర్దేశిత కాల వ్యవధుల్లో సరైన శిక్షణ కల్పించి వారి నైపుణ్యాలను పెంపొందించాలి.

- అగ్ని మాపక సేవల శాఖ అవసరాలకు సరిపడేట్లుగా ప్రభుత్వం తగిన నిధులను కేటాయించాలి. ఈ శాఖ చేపట్టే అన్వేషణ, రక్షణ చర్యలు మెరుగుపడేలా, అగ్ని మాపక సేవలను ప్రభావవంతంగా చేపట్టడానికి కావలసిన ఆధునిక పరికరాలను కొనుగోలు చేసుకోడానికి భారత ప్రభుత్వం నిర్దేశించిన విధంగా విపత్తుల ఉపశమన నిధి నుండి నిధులను విడుదల చేయాలి.

ఆడిట్ కనుగొన్న విషయాలను, చేసిన సిఫార్సులను ప్రభుత్వం అంగీకరించి, చాలాకాలం నుండి పెండింగులో ఉన్న అగ్ని మాపక సేవల శాఖ అవసరాలకు సరిపడేలా ఆ శాఖకు బడ్జెటు కేటాయింపులు పెంచడానికి అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చింది (2012 నవంబరు).